జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | బుధవారం 23 సెప్టెంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :250 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED



గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

# ఆర్థిక కేంద్రంగా కుప్పం అభివృద్ధి



- ఎకనామిక్ హబ్‌గా కుప్పాన్ని అభివృద్ధి చేస్తాం
- కుప్పం అభివృద్ధిలో మరో మైలురాయి..
- దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్ ప్రారంభించిన చంద్రబాబు
- మొత్తంగా కుప్పంలో దాదర్--పుదుచ్చేరి, వాస్కోడగామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ల ప్రారంభంతో రైల్వే సౌకర్యాల విస్తరణలో మరో ముందడుగు

**కుప్పం**

కుప్పం ప్రజలకు రైల్వే ప్రయాణ సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. దాదర్–పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడిన సీఎం.. వారి సమస్యలు, విజ్ఞప్తులను స్వీకరించారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించడంతో పాటు కుప్పాన్ని ఆర్థిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కుప్పం ప్రజలకు రైల్వే ప్రయాణ - మిగతా3లో

## పార్లమెంట్‌లో కొత్త రికార్డు



- 40 రోజులైనా ముగియని సెషన్
- కేంద్రం ప్లాన్ ఏంటి?
- ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డ లోక్‌సభ, రాజ్యసభ
- సాధారణంగా మూడు, నాలుగు రోజుల్లోనే ప్రొరోగ్ అయ్యే సమావేశం
- 40 రోజులుగా అధికారికంగా ముగింపు ప్రకటన లేకపోవడం ఇదే తొలిసారి



## ఉగ్రవాదంపై ప్రకటనలు కావు చర్యలు ముఖ్యం

- పాకిస్తాన్‌పై భారత్ కీలక వ్యాఖ్యలు
- బంగ్లాదేశ్‌తో సంబంధాలపైనా ప్రకటన
- సరిహద్దు ఉగ్రవాదానికి సంబంధించి భారత విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు

# అక్టోబర్ 1న తుది జాబితా



- మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియ
- 9 రోజుల పాటు నిర్వహణ
- మున్సిపల్ ఎన్నికలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియ
- రేపట్నుంచి నుంచి 9 రోజుల పాటు ప్రక్రియ నిర్వహణకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల గుర్తింపు ప్రక్రియ రేపటి (సెప్టెంబర్ 23) నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలి విడతగా రాష్ట్రంలోని 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు/నగర - మిగతా3లో

# టీడీపీకి సేవే లక్ష్యం



- డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం.. మంత్రి నారా లోకేశ్ సవాల్
- ఎక్కడున్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరిక..
- డీఎస్సీ, ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై చర్చకు సిద్ధమని వెల్లడి
- 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్న లోకేశ్
- కార్యకర్తల కోసం ప్రమాద బీమా, రూ.175 కోట్ల సాయం

**అమరావతి**

ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీలోనే కాదు.. అండమాన్, ఆస్ట్రేలియాలో ఉన్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరించారు. తనపై కోపం ఉంటే నేరుగా తనతో తేల్చుకోవాలని అన్నారు. డేట్, టైమ్ ఫిక్స్ చేసుకుని మాట్లాడుకుందామని చెప్పారు. డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని సవాల్ చేశారు. తమది నీతి, నిజాయతీలతో బతికిన కుటుంబమని లోకేశ్ అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై పెట్టిన ఒక్క కేసు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. జగన్‌పై విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ప్రకటించలేదని, ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని లోకేశ్ విమర్శించారు. బాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారని తెలిపారు. దాన్ని ముందుకు సాగనీయకుండా వైసీపీ నాయకులు 300 కేసులు వేశారని చెప్పారు. 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు. వారికి అమరావతిలో - మిగతా3లో




## భారత్- ఒపెక్ చమురు బంధం మరింత బలోపేతం

- ఢిల్లీలో ఉన్నత స్థాయి చర్చలు విజయవంతం!
- ఢిల్లీలో విజయవంతంగా ముగిసిన భారత్
- ఒపెక్ 7వ ఉన్నత స్థాయి ఇంధన చర్చలు
- చమురు మార్కెట్లో స్థిరత్వం, ఇంధన భద్రతపై సమావేశం
- పరస్పర సహకారానికి అంగీకారం!



## రామమందిరంలో 105 సార్లు విరాళాల చోరీ



# కోస్తాంధ్రకు భారీ వర్ష ముప్పు

- హెచ్చరికలు జారీ చేసిన హోంమంత్రి
- బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది
- కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది.

**అమరావతి**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది. కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. రాష్ట్ర హోంమంత్రి అనిత పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని హై అలర్ట్‌లో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ప్రస్తుతం వాయుగుండం కొనసాగుతోంది. ఇది రానున్న 24 - మిగతా3లో

# కూటమి మరింత బలంగా ఉండాలి



- అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గింది
- కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండోరోజు పర్యటించారు
- పిఠాపురంలో రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులకు పవన్ శ్రీకారం
- పిఠాపురం బహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి పవన్
- 'పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాం
- రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో 2 ఎస్‌పీటీల నిర్మాణం చేపట్టాం.

**కాకినాడ**

కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండో రోజు పర్యటించారు. ఇందులో భాగంగా రూ.1500 కోట్లతో పలు అభివృద్ధి పనులను ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మంగళవారం ఉదయాన్నే పవన్ తన పర్యటనను ప్రారంభించారు. తొలుత గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీసీతారామ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు పథకాల లబ్ధిదారులకు సంబంధిత పత్రాలను అందజేశారు. ఆ తర్వాత ఆర్ఆర్‌బీహెచ్ఆర్ మైదానంలో నిర్వహించిన 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' బహిరంగ సభలో పవన్ పాల్గొన్నారు. 30 మంది మత్స్యకారులకు రక్షణ పరికరాలు అందించారు. నివాస గృహాల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థులకు బ్యాగులు ఇచ్చారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు అందించారు. రైతు సంఘం నాయకులు పవన్ కల్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపి, నాగలిని - మిగతా3లో

# పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం

దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దడమే నా లక్ష్యం

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి రూ.86 కోట్లతో ఆసుపత్రులు, ఆరోగ్య వసతుల అభివృద్ధి

రూ.200 కోట్లతో రహదారులు.. రూ.470 కోట్లతో తాగునీటి పనులు రూ.225 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ.. రూ.323 కోట్లతో ఉప్పాడకు రక్షణ గోడ

పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సభలో పవన్ కళ్యాణ్.











**పిఠాపురం (ప్రజా జ్యోతి)** 'మన కూటమి ప్రభుత్వం మరింత బలంగా, సమర్థవంతంగా ముందుకు సాగాలన్నదే నా కోరిక. నాకు కృతజ్ఞత చాలా ఎక్కువ. కష్టాల్లో ఉన్న మనిషికి అండగా నిలబడటం నా స్వభావం, నా గుణం. ఈ విలువలను ఈ నేల నేర్పింది. ప్రజల అభివృద్ధే మన ప్రధాన లక్ష్యం. ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి, వాటిని తీర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దాం. వారి ఆశలు, ఆకాంక్షలకు తరువాత ముందుకు తీసుకెళ్దాం. వచ్చే మూడు, నాలుగు నెలల్లో నా క్యాంపు ఆఫీసును పిఠాపురంలో పెట్టడానికి ఏర్పాట్లు చేస్తాం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం. ఆ లక్ష్యంతోనే ఇప్పటికే వివిధ రంగాల్లో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. తాజాగా మరో రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. పిఠాపురాన్ని కేవలం ఒక నియోజకవర్గంగా కాకుండా, అభివృద్ధికి నమూనాగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పిఠాపురం ప్రజలు ఇచ్చిన గెలుపు రాష్ట్ర అభివృద్ధి కే కాకుండా దేశ అభివృద్ధికి పునాదిగా నిలిచిందని చెప్పారు. మంగళవారం పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ “పిఠాపురం నియోజక వర్గంలో గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధిని కళ్లముందు చూస్తున్నాం. వివిధ రంగాల్లో ఎన్నో కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ముందుకు తీసుకెళ్లాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పిఠాపురాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా, పిఠాపురం భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ ముందుకు సాగుతున్నాం.

**600కు పైగా సీసీ, బీటీ రోడ్లు పూర్తి చేశాం**

అధికారం చేపట్టిన తర్వాత పిఠాపురం నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికే రూ.200 కోట్లకు పైగా నిధులు వెచ్చించి, ఇప్పటికే 600 కు పైగా సీసీ రోడ్స్, బీటీ రోడ్స్ నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఈ రోజు మరో 202 రహదారులను ప్రారంభించాం. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో దాదాపు రూ.10 కోట్లతో నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఆధునీకరించి, 97 వేల మందికి తాగునీటి భరోసా కల్పించాం. గ్రామాల్లో జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో దాదాపు రూ.320 కోట్లతో, పట్టణాల్లో అమృత్ 2.0, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ సహకారంతో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో దాదాపు రూ.140 కోట్లతో తాగునీటి పనులు చేపడుతున్నాం.

**ఆరోగ్య వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం**

పిఠాపురంతోపాటు పరిసర నియోజకవర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా రూ.34 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నాం, ఇప్పటికే పనులు 50 శాతానికి పైగా పూర్తయ్యాయి. యు.కొత్తపల్లి, చేబ్రోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుర్వేద డిస్పెన్సరీ ఏర్పాటు చేశాం. రూ.7 కోట్లతో 26 కొత్త ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నాం. గత ప్రభుత్వంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఆరు గ్రామ ఆరోగ్య కేంద్రాలను పిఠాపురం ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (పాడా) నిధులతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే రూ.45 కోట్లతో కాకినాడ జీజీహెచ్ లో ఆంకాలజీ బ్లాక్ , అధునాతన లీనియర్ యాక్సిలరేటర్ పరికరం, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలు ఏర్పాటు చేస్తున్నాం.

**రూ. 225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ**

పిఠాపురం ఆధ్యాత్మిక వైభవాన్ని పెంచేందుకు రూ.34 కోట్లతో ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులు చేపట్టాం. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవాదాయశాఖ సహకారంతో 48 భజన మందిరాలు నిర్మిస్తున్నాం. రూ.2 కోట్లతో శ్రీ కుంతీమాధవస్వామి ఆలయ కోనేరు పునరుద్ధరిస్తున్నాం. పక్కనే ఉన్న రథాలపేటలో మారెమ్మ గుడిని పునర్నిర్మించి, ఖాళీ ప్రదేశాన్ని సుందరవనంగా అభివృద్ధి చేస్తున్నాం. గత పర్యటనలో పిఠాపురం పట్టణంలో మురుగు, చెత్త సమస్యను చూశాను. రూ.225 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, 40 టన్నుల తడి చెత్త శుద్ధి ప్లాంట్ ను, 5 చోట్ల పబ్లిక్ టాయిలెట్స్ బ్లాక్స్ ఏర్పాటు చేస్తున్నాం. మొగలి సూర్యుడి చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించాం. కాలుష్య నియంత్రణ మండలి నిధులతో బేలింగ్ మెషిన్ కాంపాక్టర్ అందుబాటులోకి తెచ్చాం.

**రూ.323 కోట్లతో ఉప్పాడ తీరానికి రక్షణ కవచం**

గతంలో పిఠాపురంలోకి అడుగుపెట్టగానే కనిపించిన డంపింగ్ యార్డ్ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపాం. పాదగయ క్షేత్రానికి సమీపంలో ఉన్న ఆ ప్రాంతంలో రూ.1.83 కోట్లతో సుందరమైన నగరవనాన్ని అభివృద్ధి చేశాం. అలాగే రూ.6 కోట్లతో 11 గ్రామీణ చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలను ఎన్నాళ్లుగానో వేధిస్తున్న సముద్రపు కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుకు వెళ్తున్నాం. రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించాం. దీనికి సంబంధించిన డిజైన్, సర్వేను ఐఐటీ మద్రాస్ పూర్తి చేసింది, ఇక నిర్మాణ పనులు ప్రారంభమ య్యేలా అవసరమైన ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నాం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో పలుదఫాలుగా మాట్లాడి అసాధ్యం అనుకున్న ఈ పనిని సుసాధ్యం చేయగలిగాం. ఈ ప్రయత్నానికి జనసేన పార్టీ చేసిన త్యాగాలు, సంపాదించు కున్న విశ్వసనీయత, గుడ్‌విల్ కూడా కీలకంగా నిలిచాయి. పిఠాపురం ప్రజలు అందించిన ఘన విజయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బలాన్ని అందించడమే కాకుండా, ఉప్పాడ తీర ప్రాంత ప్రజల చిరకాల సమస్య అయిన రక్షణ గోడ నిర్మాణానికి కూడా మార్గం సుగమం చేసింది

**రూ. 118 కోట్లతో ఆర్‌ఓబీకి ఆమోదం**

మన పిఠాపురం నడిబొడ్డున పీఎం గతి శక్తి పథకం కింద రూ.118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించేందుకు ఆమోదం లభించింది. అలాగే దాదాపు రూ. 100 కోట్లతో ఆయుష్ మెడికల్ కాలేజ్, సాస్కి నిధులతో రూ.100 కోట్లతో రోడ్ల అభివృద్ధి, అమృత్ భారత్ పథకం కింద రూ.37 కోట్లతో పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. అలాగే పాడా నిధులతో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ద్వారా రూ.20 కోట్లతో ఆధునిక బస్సు స్టాండ్, రూ.3 కోట్లతో 4 స్మార్ట్ కిచెన్లు, చేపల మార్కెట్, సిసి డ్రైన్లు, పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, పంచాయతీ భవనాలు, ఉప్పాడ చేనేత కమ్యూనిటీ హాళ్లు అంగన్‌వాడీ కేంద్రాలు వంటి పనులను కూడా త్వరగా పూర్తి చేస్తున్నాం.

**రూ.4 కోట్లతో ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల అభివృద్ధి**

ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థుల కోరిక మేరకు, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి, సుమారు రూ. 4 కోట్లతో కొత్త భవనాలు, కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతి గదులు, ప్లే గ్రౌండ్ లెవెలింగ్ పనులు చేపట్టబోతున్నాం. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, హోంమంత్రి అమిత్ షా కు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గ్రామీణాభివృద్ధి మంత్రివర్యులు శివరాజ్ సింగ్ చౌహాన్ ఆరోగ్యశాఖ మంత్రి జె.పి. నడ్డా అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. పిఠాపురం అభివృద్ధి ప్రతి అడుగులో కనిపించాలి, ప్రతి కుటుంబం ముందుకు సాగాలి, మన పిల్లల భవిష్యత్తుకు పిఠాపురం ఒక బలమైన పునాదిగా నిలవాలి. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందిస్తూ, పిఠాపురాన్ని మరింత గొప్పగా, మరింత అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు నా ప్రయాణం ఆగదు” అన్నారు.

# అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రభుత్వం మాట తప్పింది

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి...

కూటమి ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన



**నంద్యాల:సెప్టెంబర్=22ప్రజాజ్యోతి** నంద్యాలలో వీఆర్‌ఏల ఆందోళనకు సంపూర్ణ మద్దతు వైఎస్ జగన్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని హామీ ఎన్నికల సమయంలో ప్రజలకు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి, ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం... అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం దారుణమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మండిపడ్డారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి మాట తప్పిన కూటమి నేతలు, ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చి వీఆర్‌ఏల (వి ఆర్ ఎ) సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గత కొద్ది రోజులుగా వీఆర్‌ఏలు వివిధ డిమాండ్ల సాధన కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన వీఆర్‌ఏల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు మరియు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ... “అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చాక మరొక మాట అన్న చందంగా కూటమి నేతల వ్యవహారం ఉంది. ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ల ఆరు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది” అని విమర్శించారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం వాటిని బుట్టలో దాఖలు చేస్తోందని ధ్వజమెత్తారు. వీఆర్‌ఏల న్యాయమైన డిమాండ్ల సాధన పోరాటంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమస్యలన్నింటినీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి భరోసా కల్పించారు.

## గోరుకల్ రిజర్వాయర్ పైప్‌లైన్ ఫట్

వరద గుప్పెట్లో గోరుకల్లు గ్రామం!

పైప్‌లైన్ పగిలి ఉప్పొంగిన వరద: భయాందోళనలో గోరుకల్లు గ్రామస్థులు!

గోరుకల్లు గ్రామాన్ని ముంచెత్తిన వరద ఉధృతి -- ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు

గోరుకల్ రిజర్వాయర్ వద్ద ప్రమాదం: జలదిగ్బంధంలో గోరుకల్లు







**నంద్యాల సెప్టెంబర్ 22, ప్రజా జ్యోతి** నంద్యాల జిల్లా పాణ్యం మండలం గోరుకల్ గ్రామంలో రిజర్వాయర్ ప్రధాన పైప్‌లైన్ తీవ్రంగా దెబ్బతినడంతో గోరుకల్లు గ్రామాన్ని ఒక్కసారిగా భారీ వరద ముంచెత్తింది. రిజర్వాయర్ నుండి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు గ్రామంలోకి చేరడంతో వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని గోరుకల్లు గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తూ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామస్తులందరూ కొండనెక్కే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి, గ్రామానికి వరద ముప్పు తప్పించాలని, సహాయక చర్యలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యార్థుల ఆధార్ అప్డేట్ కు మరో చాన్స్

అక్టోబర్ 20 వరకు వివరాల నవీకరణ

**రాష్ట్రంలోని విద్యార్థులు ఆధార్ వివరాలను నవీకరించుకునేందుకు ప్రభుత్వం మరోసారి ప్రత్యేక అవకాశం కల్పించింది.**




**నంద్యాల:సెప్టెంబర్ =22ప్రజాజ్యోతి** సోమవారం నుంచి అక్టోబర్ 20 వరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉచిత ఆధార్ అప్డేట్ డ్రైవ్ ను నిర్వహించనున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. యూఐడీఏఐ నిబంధనల ప్రకారం 5 నుంచి 7 ఏళ్లలోపు పిల్లలు, 15 నుంచి 17 ఏళ్లలోపు విద్యార్థులు తమ బయోమెట్రిక్ వివరాలు (వేలిముద్రలు, ఐరిస్) తప్పనిసరిగా నవీకరించుకోవాలి. రాష్ట్రంలో ఇంకా చాలామంది ఈ ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో ప్రత్యేక డ్రైవ్ ను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే అప్డేట్ చేయాల్సిన విద్యార్థుల జాబితాలను పాఠశాలలకు పంపగా, మిగిలిన వారిని గ్రామాల వారీగా గుర్తిస్తున్నారు. ఈ శిబిరాల్లో ఆధార్ వివరాల సవరణలతో పాటు కొత్త ఆధార్ నమోదు కూడా ఉచితంగా చేపట్టనున్నారు. కొత్త ఆధార్కు జనన ధ్రువపత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, వివరాల మార్పులకు అవసరమైన జనన ధ్రువపత్రం, పదో తరగతి మార్కుల జాబితా లేదా చిరునామా ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని అధికారులు సూచించారు. తల్లి దండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పిల్లల ఆధార్ వివరాలను సకా లంలో అప్డేడేట్ చేయించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆంధ్ర శబరిమలై అయ్యప్పను దర్శించుకున్న రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే శ్రీధర్ బాబు



**శంఖవరం: సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి న్యూస్)** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే ఆరా శ్రీధర్ బాబు ఆంధ్ర శబరిమలై అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆంధ్ర శబరిమలైకి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ ధర్మకర్త కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి పూర్ణకుంభంతో ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్మకర్త కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి మాట్లాడుతూ కాకినాడ జిల్లా అన్నవరానికి 18 కిలోమీటర్ల సమీపంలో కేరళ శబరిమలై మాదిరిగానే ఆంధ్ర శబరిమలైని నిర్మించడం జరిగిందని తెలిపారు. 24 గంటలు స్వామివారికి ఇరుముడి సమర్పించి దర్శన భాగ్యం కల్పిస్తున్నామని, ఇక్కడ స్వామిని దర్శించుకుంటే భక్తుల కోరికలు నెరవేరుతాయని అన్నారు. కేరళ వెళ్లలేని భక్తులకు ఆంధ్ర శబరిమలై వరంగా మారిందని, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.అనంతరం ధర్మకర్త ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి పనుల గురించి చర్చించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, అయ్యప్ప భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## నేడు మండల స్థాయి వైసీపీ పార్టీ కార్యకర్తల సమావేశం




**బనగానపల్లె :సెప్టెంబర్ =22 ప్రజాజ్యోతి** అవుకు మండలం లోని ప్రతి గ్రామం లోని వై. యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందురు ఆహ్వానితులు గా భావించి ఈ కార్యక్రమం ను విజయవంతం చేయాలని మనవి రేపు ఉదయం 9.గంటలకు అవుకు మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి కార్యాలయం నందు హాజరు కావాలేనని మనవి

# చొప్పెల్ల పంచాయతీ వద్ద దివ్యాంగుల హక్కుల చట్టం ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కార్యక్రమం





**ఆలమూరు సెప్టెంబర్ 22(ప్రజాజ్యోతి):**డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలో పంచాయతీ కార్యాలయం నందు మంగళవారం పౌరసంస్థ సిబిఆర్ కో ఆర్డినేటర్ బడుగు మహిమారావు ఆధ్వర్యంలో 2016 దివ్యాంగుల హక్కుల చట్టం మరియు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా రిసోర్స్ పర్సన్ గా హాజరైన ల్యాంప్ సంస్థ అడ్వకేసి కో ఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం, ప్రభుత్వ పథకాలు, ట్రైన్,బస్సు పాస్ ల గురించి,ఏ కేటగిరి వారు దివ్యాంగుల పరిధిలోకి వస్తారనేది, రూ.15000 పింఛన్ కి ఎవరు అర్హులు అనేది తెలియజేసారు.ఎవరూ కూడా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా మీ హక్కులని మీరు కాపాడుకోవాలని,సదరం స్లాట్ బుకింగ్ ముందు ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవాలని, కొత్త పెన్షన్ లు ఎలా అప్లై చేయాలి అనే విషయాలు పై అవగాహన కల్పించారు. అంతేకాకుండా సదరం సర్టిఫికెట్లో బహుళ వికలాంగత్వం, రీ అసెస్మెంట్ కి వెళ్ళిన వారికి ఇంతవరకు సర్టిఫికెట్స్ రాకపోవడం పలు విషయాలను ఈ మీటింగ్స్ ద్వారా క్రోడీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.తదుపరి దివ్యాంగులతో గ్రామ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పాలింగి రాజు,50 మంది దివ్యాంగులు,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# శబరికొత్తగూడెం అంగన్వాడీ కేంద్రంలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం







**కూనవరం, సెప్టెంబర్ 22: ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు, కూనవరం ప్రాజెక్టు అధికారిణి వి. మల్లిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషణ మాసం--2026 కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూనవరం మండలం శబరికొత్తగూడెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ ఏ. నయోమి రాణి తల్లులకు పోషకాహారం, ప్రేమతో కూడిన సంరక్షణ, అంగన్వాడీ కేంద్రాల్లో అందించే హాట్ కుక్డ్ మీల్స్, స్థానిక ఆహార పదార్థాలతో కొత్త రుచులు, ఆకుకూరలు--కూరగాయలలోని పోషక విలువలపై అవగాహన కల్పించారు.అంగన్వాడీ కార్యకర్తలు సుహాసిని, శారమ్మ ఆధ్వర్యంలో మునగ ఆకుతో చపాతీ, ఎగ్ కర్రీ, దోసెలు, వడలు, కారం పొడి తదితర పోషక వంటకాలను తయారు చేసి గ్రామస్తులకు ప్రదర్శించారు. స్థానికంగా లభించే ఆహార పదార్థాలతో రుచికరమైన, పోషక విలువలు కలిగిన వంటకాలను తయారు చేసుకోవచ్చని వివరించారు.అదేవిధంగా అంగన్వాడీ కేంద్రంలో కొత్తగా నమోదు అయిన నలుగురు గర్భిణులకు పండ్లు, స్వీట్లు అందించి 'గర్భిణీ ఆహ్వానం' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తల్లులు, గ్రామ పెద్దలు, డ్వాక్రా మహిళలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వర్ణ గ్రామ సెక్రటరీ, మహిళా పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

# రేఖపల్లి, మెయిన్ రోడ్ల దుస్థితి పై అధికారులు స్పందించాలి!..







**పోలవరం ప్రాజెక్టు పేరుతో అభివృద్ధిని అడ్డుకోవద్దు!..**

**ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే?..**

**ఎవరు బాధ్యులు!..**

**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 22 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** వరరామచంద్రాపురం, మండల,రేఖపల్లి మెయిన్,దుస్థితి పై అధికారులు స్పందించాలని, రోడ్డుకి రెండువైపులా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని రేఖపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మెయిన్ రోడ్లుకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడ నీళ్లు అక్కడే రోడ్ల పై నిలిచి, పాద చారులకు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వర్షాలకు, రోడ్లు జలమయంగా మారుతున్నాయని. గుంతలు పడిన రోడ్లపై ప్రయాణం నరకంగా మారిందని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. స్వచ్ఛ భారత్,ఎక్కడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రేఖపల్లి, సెంటర్ నుండి రాజుపేట, క్రాస్ రోడ్డు వరకు డ్రైనేజీ వ్యవస్థ రెండువైపులా,ఏర్పాటు చేస్తే నీరువృధా కాకుండా "ముత్యాల తల్లి చెరువుకు నీరు చేరే విధంగా ఇంజినీరింగ్, అధికారులు ప్లాన్ చేసి డ్రైనేజీ నిర్మాణం చేస్తే నీరు వృదాకాకుండా త్వరగా చెరువునిండే అవకాశాలు ఉంటాయని, రోడ్లు బాగుపడతాయని, స్థానికులు అంటున్నారు. ఆర్.బి, అధికారులు స్పందించాలని, రేఖపల్లి మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. తరచు ప్రమాదాలు జరువుతున్నాయని ఏదో కాలువ తీసివదిలేస్తే తీరే సమస్య కాదని,భూడిద షిప్స్ వేస్తే సమస్యపరిష్కారంకాదని చేతులు దులుపుకునే పనికాదని శాశ్విత పరిస్కారంకోసం సంబంధిత ఆర్ బి, అధికారులు చొరవ తీసుకోవాలని వ్యాపారులు, వాహనదారులు, పాదచారులు, ప్రజలు కోరుతున్నారు. పోలవరం ప్రాజెక్టు పేరుచెప్పి ఇలా అభివృద్ధిని నిరోధించడం న్యాయంగా ఉందాని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

# వి అర్ ఏ ల డిమాండ్లకు కృషి

**నంద్యాల శిరివెళ్ల:సెప్టెంబర్=22 ప్రజాజ్యోతి శిరివెళ్ల :** గ్రామ రెవెన్యూ సహాయకుల డిమాండ్ల సాధనకు అలుపెరగని పోరాటం తప్పదని అందుకు నిరంతరం కృషి చేస్తామని మండల యూనియన్ నాయకులు పేర్కొన్నారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు, నిరసనలు మరియు సమ్మెలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శిరివెళ్ల మండల కేంద్రంలో సైతం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమంలో సిరివెళ్ల మండల అధ్యక్షులు సర్లే సర్న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన నిర్వహించి నినాదాలు చేశారు. ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టిన కారణం గా ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల మండల అధ్యక్షులు పాములేటి ఉపాధ్యక్షులు మాలి కార్యదర్శి ముని ట్రెజరీ మస్తాన్ కోనేటి తిరుపాల్, చెన్నూరు తిరుపాలు సాహెల్ తదితర వీఆర్ఏ లతోపాటు సుమారు 30 మందికి పైగా ధర్నాలతో తాసిల్దార్ కార్యాలయం దద్దరిల్లేలా ఆందోళన చేపట్టారు



## పవన్ కళ్యాణ్ సభకు భారీగా తరలిన జనసైనికులు

**గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 500కు పైగా బైకులతో ర్యాలీ**



**శంఖవరం : అక్టోబర్ 22 (ప్రజా జ్యోతి న్యూస్)** పిఠాపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు గ్రామం నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ సంప్రదింపుల కమిటీ సభ్యులు, జనసేన నాయకుడు గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 500కు పైగా ద్విచక్ర వాహనాలతో జనసైనికులు పిఠాపురం సభకు బయలుదేరారు.పిఠాపురం సభ నేపథ్యంలో కొంతంగి కొత్తూరు గ్రామంలో జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పెద్ద సంఖ్యలో బైకులు, పార్టీ జెండాలతో జనసైనికులు తరలిరావడంతో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం కనిపించింది. గ్రామాల నుంచి బయలుదేరిన జనసైనికులు సమన్వయంతో పిఠాపురం వైపు పయనించారు. ఈ సందర్భంగా గొర్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పిఠాపురంలో నిర్వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బహిరంగ సభకు జనసేన నాయకులు, కార్యకర్తలను తరలించినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జనసైనికులు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు.కొంతంగి కొత్తూరు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో జనసైనికులు స్వచ్ఛందంగా సభకు తరలివెళ్లడం పార్టీ పట్ల కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహానికి నిదర్శనమని నాగేశ్వరరావు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పిల్లల పౌష్టికాహారంపై అవగాహన.



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 22.**పోషణ మహా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోడూరు లోని పూజారి వారి గురువు అంగన్వాడి కేంద్రం వద్ద సి పి డి ఓ యమ్ ఉమ ఆదేశాల మేరకు పిల్లల పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కార్యక్రమం జరిపారు. సూపర్వైజర్ హసీనా మాట్లాడుతూ పిల్లలకు జంక్ ఫుడ్ పెట్టరాదన్నారు. బాలామృతం తోపిల్లలకి పౌష్టికాహారం తయారు చేసి పెట్టాలన్నారు. బిర్యానీలు తినరాదని డ్రింకులు తీసుకోరాదని ఆకుకూరలు చిరుధాన్యాలు తీసుకోవాలని చిరుధాన్యాలతో లడ్డు అలాంటి తయారు చేసి పిల్లలకు పెట్టాలని సూచించారు. అంగన్వాడి సెంటర్లో ప్రీస్కూల్ పిల్లలకి మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనం పెట్టడం జరుగుతుందనఆటపాటలతో అంగన్వాడి సెంటర్ లో పిల్లలకి నేర్పించడం జరుగుతున్నదని తెలిపారు. అనంతరం ప్రధాన వీధిలో అవగాహనా ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమం లో ప్రాథమిక పాఠశాల టీచర్ సిహెచ్, కరుణకుమారి అంగన్వాడి కార్యకర్త అన్నవరం ,సహాయకురాలు మాణిక్యం లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రూ.22 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సత్యప్రభ శ్రీకారం

--హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా ఏలేశ్వరం పట్టణ అభివృద్ధి

--వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు




**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**ఏలేశ్వరం మున్సిపాలిటీలో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా రూ.22 కోట్లతో చేపట్టనున్న పట్టణ అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ఈ పథకాన్ని ప్రారంభించారు.ఏలేశ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని,ముఖ్యమంత్రి ప్రసంగాన్ని కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి వీక్షించారు.అనంతరం పట్టణంలో రూ.22 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆవిష్కరించారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు మూది నారాయణస్వామి,బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా 21 మున్సిపాలిటీల్లో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా పట్టణాల అభివృద్ధికి చర్యలు చేపడుతుండగా,అందులో ఏలేశ్వరం మున్సిపాలిటీకి అవకాశం లభించడం పట్ల ఎమ్మెల్యే సత్యప్రభ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు.అర్బన్ డెవలప్‌మెంట్ ద్వారా ఏలేశ్వరం పట్టణానికి మరో రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.వీటితో కలిపి ఇప్పటివరకు ఏలేశ్వరం పట్టణంలో సుమారు రూ.110 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, అలమండ చలమయ్య, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, అన్నవరం ట్రస్ట్ బోర్డు మెంబెర్ పర్వత సురేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మణి రామారావు, లింగంపర్తి సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్, గట్టెం వెంకటరమణ, మైరాల కనకారావు, వైభోగుల సుబ్బారావు, వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు, కోణాల వెంకటరమణ, ఎండగుడి నాగబాబు, రుచి రమేష్, పలివెల వెంకటేష్, బుగత శ్రీను తదితర కూటమి నాయకులు,కార్యకర్తలు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారుల చిత్ర లేఖన ప్రదర్శన



**(కోవెలకుంట్ల)సంజామల:సెప్టెంబర్= 22ప్రజాజ్యోతి** సంజామల మండలం పేరు సోమల జడ్పిటిసి హై స్కూల్ నందు చిన్నారుల కలలు చిత్రలేఖను ప్రదర్శించడం బిజెపి మండల నాయకత్వం పాల్గొని శ్రీ గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి జన్మదిన భాగంగా ఈరోజు చిన్నారుల చిత్రలేఖను ప్రదర్శించడం హై స్కూల్ హెచ్ఎం బిజెపి నాయకత్వం ఆధ్వర్యంలో పిల్లలకు పోటీ పరీక్ష పెట్టడం పోటీలో పాల్గొని విజేతలకు ఫస్ట్ బహుమతి సెకండ్ బహుమతి తరుడు బహుమతి ఉంటుంది ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షులు చింతమాను చిన్న పెద్దన్న బిజెపి మండల ఉపాధ్యక్షులు సగినేల జగదీశ్వరయ్య బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అమ్మడాల రామాంజనేయులు బిజెపి కార్యదర్శి గిద్దలూరు రఘురాం బిజెపి కోశాధికారి పాలూరి బాలగ్రం అలాగే స్కూలు హెడ్మాస్టర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## చెన్నూరు శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో చోరీ



**చెన్నూరు సెప్టెంబర్ 22 ప్రజా జ్యోతి** చెన్నూరు ఎల్లమ్మ కాలనీలో శ్రీ ఎల్లమ్మ దేవాలయం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు తెలిసింది. ఉదయం స్థానిక పూజారి ఆలయం వద్ద చూడగానే ప్రధాన గేటు, గర్భగుడి తలుపులు తెరిచి ఉండడంతో స్టోరీ జరిగినట్లు అనుమానించి స్థానికులకు తెలిపింది. ఆలయంలో అమ్మవారి కిరీటము,, పోగులు కమ్మలు ఇతర వెండి వెండి వస్తువులు కోరిక అయినట్టు తెలిసింది. దాదాపు అరకిలో వెండి పోయినట్టు సమాచారం. వాటి విలువ రెండు లక్షల వరకు ఉండవచ్చు అని స్థానికులు తెలిపారు అమ్మవారితో నగలను దొంగలించిన దొంగలు కఠినంగా శిక్షించాలని స్థానిక కోరుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆలయం వద్దకు వచ్చి పరిశీలించి కేసు దర్యాప్తుకు ముమ్మరం చేస్తున్నట్టు తెలిపారు.

## శ్రీ మూల పెద్దమ్మ కొత్తూరు సుబ్బరాయుడు స్వామిని దర్శించుకొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని సోదరులు



**నంద్యాల దొర్నిపాడు :సెప్టెంబర్=22 ప్రజాజ్యోతి** దొర్నిపాడు మండలం ఔ.గోవిందిన్నె గ్రామం లో కొలువైన శ్రీ మూల పెద్దమ్మ అమ్మవారికి కొత్తూరు సుబ్బరాయుడు ప్రధాన అర్చకుడు కంపమల్ల నారాయణ స్వామి మొక్కుబడి సందర్భంగా హాజరు అయి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నంద్యాల వైఎస్సార్సీపీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ,నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి

## వరరామచంద్రాపురంలో కరువు పరిస్థితులు!..

**ఎల్నీనో ప్రభావంతో కనిపించని ఖరీఫ్ పంటసాగు!..**



**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 22 (ప్రజాజ్యోతి ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విలీన మండలంమైన వరరామచంద్రాపురం,మండల పరిధిలో,ఎల్నీనో ప్రభావంతో ఏజెన్సీగ్రామాల్లో ఖరీఫ్ పంటసాగుపూర్తిస్థాయిలో తగ్గింది.వేలాది ఎకరాల్లో వరిసాగు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగు విస్తీర్ణంభారీగా తగ్గింది.వేసినపంటలు,వర్షాభావ పరిస్థితులనుఎదుర్కొనలేక వాడిపోతున్నాయి.మండలంలో కనీసస్థాయివర్షపాతంకూడా నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళనవ్యక్తంచేస్తున్నారు.మండలంలోకరువు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.గత రెండురోజులుగాఅడపాదడపా కురుస్తున్నవర్షాలకు నారుమళ్లు కొద్దిగా చిగురించాయి.ఏది ఏమైనా వరరామచంద్రాపురం మండలాన్నికరువు మండలంగా ప్రకటించాని,ఏజెన్సీ గ్రామాల ప్రజలకు ప్రభుత్వ పౌరసరఫరాల ద్వారా నిత్యావసర సరుకులు సరసమైన ధరలకు ఇవ్వాల్సిన అవసరం ఉందని,ఆదిశగా ప్రభుత్వం,చొరవచూపాలని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన గిరిజనేతర ప్రజలు కోరుతున్నారు.

## పామిడి సర్పంచ్ రేసులో యువ పాత్రికేయుడు




**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** సీనియర్ నేతలతో మంతనాలు.. ప్రజాసేవలోకి రావాలన్న యోచన పామిడి సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పలువురు ఆశావహుల పేర్లు వినిపిస్తున్న వేళ ఓ యువ పాత్రికేయుడి పేరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. దాదాపు 16 సంవత్సరాలుగా ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసిన ఆయన ప్రజాసేవలోకి రావాలనే ఉద్దేశంతో పలువురు సీనియర్ నాయకులతో చర్చలు జరుపుతున్నట్లు స్థానికంగా సమాచారం కుటుంబ అండదండలతో పాటు ఆర్థికంగా కూడా బలమైన నేపథ్యం ఉన్న వ్యక్తిగా ఆయనకు రాజకీయ వర్గాల్లో పరిచయాలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో 2014లో పామిడి మున్సిపాలిటీ ఎన్నికలు జరిగిన తర్వాత వివిధ కారణాలతో ఎన్నికలు జరగకపోవడంతో స్థానిక రాజకీయాల్లో కొంత విరామం ఏర్పడింది. ప్రస్తుతం పామిడి పంచాయతీగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సర్పంచ్ పదవిపై పలువురు ఆశావహులు ఆసక్తి చూపుతున్నారు.ఈ క్రమంలో యువ పాత్రికేయుడు సర్పంచ్ బరిలోకి దిగుతారన్న ప్రచారం స్థానికంగా జోరందుకుంది. అయితే ఆయన పోటీపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడాల్సి ఉంది. దీంతో రానున్న రోజుల్లో పామిడి సర్పంచ్ ఎన్నికల సమీకరణాలు ఏ విధంగా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

## చల్లవారిగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం

**వైసీపీ నాయకుడు వీరబ్రహ్మం కు కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన అధ్యక్షులు**





**వేలేరుపాడు :22 సెప్టెంబర్ వేలేరుపాడు: ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్)** వేలేరు పాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమరవరపు అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం చల్లవారిగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోక్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాతనే ప్రాజెక్టు పనులు కానీ నిర్వాసితులకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ కాలనీ పనులు కానీ వసతులు సమాకూర్చారని అన్నారు. అయితే 2019 నుండి 2024 వరకు ఉన్న వైసీపీ ప్రభుత్వం అటు ప్రాజెక్టును ఇటు నిర్వాసితులను గాలికి వదిలేసిందని మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిర్వాసితులందరికీ న్యాయం జరిగిందన్నారు. చల్లవారి గూడెంలో నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలకు సంబంధించిన డీఈఓతో కలిసి నిర్వాసితులకు ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని వారిని కోరారు. అనంతరం ఆత్మీయ సమావేశం లో చల్లవారిగూడెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా మిరియాల పుల్లారావు, ఉపాధ్యక్షుడిగా బుడిపిటి శంకరయ్య, కార్యదర్శిగా ఆకుల పోసి బాబును నియమించారు. అదేవిధంగా కోయిదా గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు చింతపల్లి బ్రహ్మం తెలుగుదేశం పార్టీలో చేరారు ఆయనను మండల పార్టీ అధ్యక్షులు అశోక్ పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గొంది నాగేశ్వరావు, రాంబాబు, కోటిపల్లి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు -ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

**--సహకరించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,ఎంపీటీసీలకు,అధికారులకు కృతజ్ఞతలు**




**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మీడియా సమావేశం నిర్వహించారు.ఎంపీపీగా తాను బాధ్యతలు స్వీకరించి ఐదేళ్ల పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు.తన ఐదేళ్ల పదవీకాలంలో ఏలేశ్వరం మండల పరిధిలో సుమారు రూ.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు గొల్లపల్లి బుజ్జి తెలిపారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే అభివృద్ధి పనుల అమలులో సహకరించిన ఎంపీటీసీ సభ్యులకు,అధికారులు,సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.ప్రజా పరిపాలనలో భాగంగా పనిచేసే క్రమంలో ఏ అధికారి అయినా తన వల్ల మనసు నొచ్చుకుని ఉంటే తనను క్షమించాలని మీడియా ముఖంగా కోరారు.తనకు ఎవరిపైనా ద్వేషం లేదని,ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించినట్లు పేర్కొన్నారు.తాను చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో సహకరించిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులందరికీ గొల్లపల్లి బుజ్జి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఐదేళ్ల పదవీకాలంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన.



**పోదూరు. ప్రజాజ్యోతి. రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 22.** మండలంలో ఐ సి డి యస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేడంగి పాలెం అంగన్వాడీ కేంద్రంలో సీపీడీఓ యమ్ ఉమ ఆదేశాల మేరకు మంగళవారం తల్లులకు పౌష్టికాహారం, పోషణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లులకు ఆహార వైవిధ్యంపై సూపర్ వైజర్ ఉమారాణి అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్ తీసుకోరాదని పంచదార వాడకం తగ్గించాలని సూచించారు. చిరుధాన్యాలతో లడ్డూల వంటివి తయారుచేసి పిల్లలకు పెట్టాలన్నారు. పిల్లలకి కురుకు రైస్ పెట్టరాదని సూపర్ వైజర్ ఉమారాణి వివరించారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు, ఆయాలు గ్రామ ప్రధాన వీధులలో పౌష్టికాహారం పై అవగాహనా ర్యాలీ జరిపారు.ఈ కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్లు ఎల్ జగదీశ్వరి రత్న కుమారి రామలక్ష్మి ఆయాలు ఆశా వర్కర్ సాయి తల్లులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## రైతు భరోసా కేంద్రంపై నేటికి మాజీ వైఎస్ఆర్ పేరు

**- రైతు సేవా కేంద్రాలుగా మారని ఆర్బీకేలు**

**- ప్రభుత్వ ఆదేశాల అమల్లో నిర్లక్ష్యం**



**చాగలమర్రి , సెప్టెంబర్ 22( ప్రజాజ్యోతి న్యూస్) ;** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల మూడు నెలలు పూర్తి అవుతుంది. అయినా, గత వైసీపీ ప్రభుత్వ ఆనవాలు ఇంకా పోవడం లేదు. జగన్ పాలనలో ఆయన పేరు, ఆయన తండ్రి వైఎస్ఆర్ పేరుతో పథకాలను అమలు చేసేవారు. అలాగే, ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేసి వాటిపై వైఎస్ఆర్, జగన్ పేర్లు రాసి బొమ్మలను అతికించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయినా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చింది.నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం డి.వనిపెంట గ్రామంలో రైతు భరోసా కేంద్రం ప్రభుత్వ భవనానికి ఇంకా పాతపేర్లు, వైసీపీ రంగులే కనిపిస్తున్నాయి.అధికారులు నేటికి తొలగించలేదు.కానీ, నేటికీ అవి రైతు భరోసా కేంద్రాలుగానే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా భవనాలపై పేర్ల మార్పుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన జోకా శ్రీనివాస్

**--పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన జోకా వెంకట శ్రీనివాస విజయకుమార్ జనసేన పార్టీలో చేరారు. పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి,జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు.విజయకుమార్ 1969 నవంబరు 5న జన్మించారు.బీకాం,బీఎల్ పూర్తిచేసి న్యాయవాదిగా కొనసాగుతున్నారు.1995లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.అనంతరం కిర్లంపూడి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ కార్యదర్శిగా పనిచేశారు.2009లో ప్రజారాజ్యం పార్టీ మండల ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు.రాజకీయాల తో పాటు న్యాయ,సామాజిక రంగాల్లోనూ ఆయన సేవలందించారు.బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఆరేళ్లు పనిచేశారు. ప్రస్తుతం కాకినాడ బార్ అసోసియేషన్‌లో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ విభాగాల కార్యదర్శిగా కొనసాగుతున్నారు.కరోనా సమయంలో 20 వేల మందికి ఉచితంగా కరోనా నిరోధక మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.పేదలకు ఇళ్ల స్థలాలు,ఇళ్లు ఇప్పించడం, వికలాంగులు,వృద్ధులకు పెన్షన్లు,వైద్య సహాయం,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేసినట్లు పేర్కొన్నారు.జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని జోకా శ్రీనివాస విజయకుమార్ తెలిపారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు జనసేన బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.పార్టీలో ఎటువంటి పదవులు ఆశించకుండా పార్టీకి కట్టుబడి పనిచేస్తా అని తెలిపారు.

## లక్ష గోవింద నామస్మరణతో మారుమోగిన ప్రత్తిపాడు మునసుబు వారి రామాలయం

--పరివర్తిని ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు

--మహిళా భక్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమం



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు గ్రామంలోని మునసుబు వారి రామాలయంలో (పెరికీల రామాలయం) పరివర్తిని ఏకాదశి సందర్భంగా లక్ష గోవింద నామస్మరణతో మారుమోగింది.మహిళా భక్తుల ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం,లక్ష గోవింద నామాల భజన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించిన అనంతరం కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని స్మరిస్తూ మహిళా భక్తులు లక్ష గోవింద నామాలను భజించారు.మదినే సాయి కుమారి,చిలకమర్తి చంద్ర,అల్లం భవానీ,అడబాల అనంత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీ కృష్ణ సత్సంగ మహిళా భజన మండలి శ్రీ కనకదుర్గ మహిళా భజన సమాజాలు ఆర్థిక సహకారం అందించాయి.ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో గోవింద నామస్మరణ చేశారు.అనంతరం అన్నసమారాధన నిర్వహించి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు.లక్ష గోవింద నామస్మరణతో ప్రత్తిపాడు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

## లడ్డూ వివాదంపై వాస్తవాలు వెలుగులోకి రావాలి

**రాజకీయ ఆరోపణలకు బదులు దర్యాప్తు వివరాల ఆధారంగా చర్చ జరగాలి కోన రఘుపతి**



**బాపట్ల సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ గతంలో జరిగిన రాజకీయ ప్రచారంపై దర్యాప్తు సంస్థలు వెల్లడించిన వివరాల నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అన్నారు. భక్తుల విశ్వాసాలకు సంబంధించిన సున్నితమైన అంశాన్ని రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికగా మార్చకుండా దర్యాప్తులో వెల్లడైన అంశాల ఆధారంగా మాట్లాడాలని సూచించారు.బాపట్ల పాత బస్టాండ్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. లడ్డూ ప్రసాదం విషయంలో గతంలో చేసిన ఆరోపణలపై ప్రస్తుతం వెలువడుతున్న దర్యాప్తు వివరాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ అంశంలో భక్తుల మనోభావాలను గౌరవిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.తిరుపతి లడ్డూ వ్యవహారంపై గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహా కూటమి నేతలు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయని పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న దర్యాప్తు వివరాల ఆధారంగా అప్పటి ఆరోపణల పై సంబంధిత వర్గాలు స్పష్టత ఇవ్వాలని కోన రఘుపతి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు

## హ్యామ్ విధానములో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం,



**డోన్ (ప్రజా జ్యోతి )సెప్టెంబర్ 22** నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో మంగళవారం షాది ఖానా లో ఉదయం 10:30 గంటలకు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగాపట్టణ మౌలిక వసతుల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం జరిగినది, ఈ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి వర్చువల్ గా పాల్గొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు, పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (నూవీ) విధానంలో రూ.21 కోట్లఅంచనా వ్యయంతో మొత్తం13.18 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి పనులు. మరియు, బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలో17 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కూడా ప్రారంభోత్సవం జరిగింది.ఈ అభివృద్ధి పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రినారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా డోన్ శాసన సభ్యులు మాట్లాడుతూ డోన్ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందనిప్రజలకు మెరుగైన రహదారులు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని,గతంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోందని, డోన్ పట్టణాన్ని మరింత ఆధునికంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని.రహదారుల అభివృద్ధి పూర్తయితే పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాలకు కూడా రాకపోకలు మరింత సులభతరం ఉంటాయని, పట్టణ అభివృద్ధికి ఇది మొదటి అడుగు, ప్రజల అవసరాలకు అనుగుణంగా డోన్ నియోజక వర్గంలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామనిఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ నరేష్ రెడ్డి, మున్సిపాలిటీ అధికారులు, తెలుగుదేశం నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు,

# కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**-రైతులను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.**

**-వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ.వై. విశ్వేశ్వర్ రెడ్డి అన్న గారి ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తులూరు అశోక్ కుమార్**



**సెప్టెంబర్ 22 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తులూరు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండలో అఖిలపక్ష పార్టీలు సిపిఐ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ ల ఆధ్వర్యంలో రైతులను ఆదుకోవాలని కోరుతూ చేపట్టిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులపై శాస్త్రవేత్తలు ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. అనంతపురం జిల్లాలో 50 శాతం కూడా సాగు జరగలేదని, సాగు చేసిన పంటలు సైతం ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.గతంలో కరువు సమయంలో మండల కేంద్రాల్లో గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి పశువులను ఆదుకోవడంతోపాటు ప్రత్యామ్నాయ విత్తనాలు అందించేవారని, ప్రస్తుతం అలాంటి చర్యలు కనిపించడం లేదన్నారు. హంద్రీ--నీవా కాలువ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ పిల్ల కాలువలు లేకపోవడంతో రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలగడం లేదని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చి వాటిని సమగ్ర అభివృద్ధికి వినియోగించకుండా అమరావతి రాజధాని నిర్మాణానికే అధికంగా ఖర్చు చేస్తోందని, రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ముత్తులూరు అశోక్ కుమార్ ఆరోపించారు. రాయలసీమ ప్రాంతాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.అనంతపురం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతుల రుణాలు మాఫీ చేయాలని, పంట నష్టపరిహారం, పంటల బీమా పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి పశువులను, వ్యవసాయ కూలీలను ఉపాధి పనులు పెంచి ఆదుకోవాలని కోరారు.ప్రభుత్వం స్పందించకపోతే రానున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ దీక్షకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ ఎంపీపీ నరసింహులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి కాంగ్రెస్ పార్టీ లీడర్ సోనియా సీనా సిపిఐలి నియోజకవర్గ కార్యదర్శి చెన్న రాయుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు డిష్. సురేష్ పట్టణ అధ్యక్షులు ఈడిగ ప్రసాద్ వజ్రకరూరు మండల అధ్యక్షులు బిందెల సోమశేఖర్ రెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లెల జగదీష్ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కొడికి గోవిందు మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రి స్వామి ఎంపీటీసీలు వన్నూరు సాబ్ నింబగల్లు ఈశ్వర్ ఆమిద్యాల ఓబయ్య ప్యాపిలి బీమా పురుషోత్తం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చేబ్రోలు సీతారామస్వామి వారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలయ అభివృద్ధికి రూ. 90 లక్షల నిధులు మంజూరు





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం, చేబ్రోలులోని ప్రసిద్ధ శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్నారు. ఏకాదశి వ్రతాచరణలో భాగంగా మంగళవారం ఉదయం ఆయన స్వామివారి ప్రాతఃకాల సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాములవారికి అష్టోత్తర శతనామావళితో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు పవన్ కళ్యాణ్‌కు వేదాశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాల నడుమ 'పూర్ణకుంభం'తో ఘన స్వాగతం పలికారు. ఏకాదశి పర్వదినాన రామాలయాన్ని సందర్శించడం అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక కార్యమని ఈ సందర్భంగా పండితులు పేర్కొన్నారు.

**రూ. 90 లక్షలతో ఆలయ అభివృద్ధి పనులు**

గత సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో చేబ్రోలు శ్రీ సీతారామస్వామి ఆలయ సమీపంలో పవన్ కళ్యాణ్ బహిరంగ సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. కూటమి విజయం సాధించిన అనంతరం ఆయన ఇచ్చిన మాట ప్రకారం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా రెండు విడతలుగా దాదాపు రూ. 90 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆలయ ప్రాంగణంలో కాలక్షేప మండపం, రథశాల, నిత్య అన్నదాన హాలు, యాగశాల నిర్మాణంతో పాటు పలు కీలక మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టారు.ఈ ఆలయ సందర్శన అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో పలు అధికారిక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలు.

## నేరస్థలానికే ఫోరెన్సిక్ సేవలు

బాపట్ల జిల్లాలో మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ ప్రారంభం



**బాపట్ల సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** నేర దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణను మరింత బలోపేతం చేసేందుకు బాపట్ల జిల్లా పోలీసు శాఖలో మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ వాహనాన్ని ప్రారంభించారు.నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను గుర్తించి, శాస్త్రీయ పద్ధతిలో సేకరించి భద్రపరిచేందుకు ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ఇందులో డీఎన్ఏ, వేలిముద్రలు, గన్‌షాట్ రెసిడ్యూ, ట్రేస్ ఎవిడెన్స్, మాదకద్రవ్యాల గుర్తింపు, అగ్ని ప్రమాదాల పరిశీలనతో పాటు సైబర్ ఫోరెన్సిక్‌కు సంబంధించిన 250కి పైగా ఆధునిక పరికరాలు ఉన్నాయని వివరించారు.భౌతిక ఆధారాలతో పాటు డిజిటల్ ఆధారాలను కూడా ప్రాథమిక దశలోనే సేకరించి భద్రపరిచే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతికత ఆధారిత దర్యాప్తుకు మరింత ప్రాధాన్యం ఇస్తూ, కేసుల దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించేందుకు మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్‌ను పూర్తిస్థాయిలో వినియోగిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, డీఎస్పీలు సిహెచ్. చంద్రమౌళి, పి. జగదీష్ నాయక్, పి. కృష్ణమరాజు, సీఐలు, ఆర్ఐలు, క్లూస్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

## బాపట్ల అభివృద్ధికి మరో కీలక అడుగు

(హెచ్,ఏ,ఎం) ప్రాజెక్టుకు శ్రీకారం.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం



**బాపట్ల సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, మెరుగైన మౌలిక వసతులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన పలు ప్రాజెక్టులను దశలవారీగా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.ఈ క్రమంలో బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్, ఏ, ఎం) ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు.బాపట్లను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు, ప్రాజెక్టులను తీసుకురావడంతో పాటు వాటి అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, పట్టణ మౌలిక వసతులు తదితర రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బావుడా చైర్మన్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్ బాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు మందపాటి ఆంద్రెయ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల నారాయణ, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతులు ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి





ఆర్బీకే సిబ్బందితో మండల వ్యవసాయ అధికారి సమావేశం

**హొళగుంద, సెప్టెంబర్ 22,ప్రజా జ్యోతి న్యూస్-** మండలం లోని రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీ భాస్కర్ లోకనాథ్ సూచించారు. మంగళవారం ఆర్బీకే సిబ్బందితో పాటు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. మండలం లోని రైతులు తమ పంటల వివరాలను ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే రైతులు ఈ-కేవైసీ ప్రక్రియను కూడా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే వివిధ వ్యవసాయ సేవలు, పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు తమకు సంబంధించిన వివరాలు, పంటల నమోదు విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితర వ్యవసాయ సంబంధిత సేవలను సకాలంలో అందించేందుకు ఆర్బీకే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దివాకర్, ఆర్బీకే సిబ్బంది విజయ్, రమేష్, శివప్రసాద్, రవి సాయిల్ తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# హొళగుందను కరువు మండలంగా ప్రకటించాలి

**సర్వసభ్య సమావేశంలో తీర్మానం..**
**సజావుగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం**





**హొళగుంద, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి న్యూస్):** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో హొళగుంద మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సయ్యద్ ఉమర్ ఆధ్వర్యంలో, ఎంపీపీ తంబాకు నూర్జహాన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు పాల్గొని తమ శాఖల పరిధిలో చేపట్టిన కార్యక్రమాలు, పురోగతిపై సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి బిందుమాధవి మాట్లాడుతూ హొళగుంద పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వైద్యాధికారిణి స్పందిస్తూ ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోక్‌దళ్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఈ ఏడాది రైతులు పెద్ద సంఖ్యలో పంట బీమా నమోదు చేసుకున్నారని తెలిపారు. పంట బీమా ప్రయోజనం పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. హొళగుంద మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు.మండల విద్యాధికారిణి సుధారాణి మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించినట్లు తెలిపారు. మెగా డీఎస్సీ-2025 ద్వారా మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత గణనీయంగా తగ్గిందన్నారు.అనంతరం ఎంపీటీసీల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో వారు అందించిన సేవలను అధికారులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# పిల్లల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పొదుపు అలవర్చుకోవాలి

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఏజెన్సీ మేనేజర్ టి. శేఖర్.**




**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 22.** పిల్లల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తల్లిదండ్రులు పొదుపు అలవర్చుకోవాలని పిల్లల విద్య, అభివృద్ధి,కి అనుగుణంగా ఆర్థిక ప్రణాళికపై అవగాహన పెంచుకోవాలని పాలకొల్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఏజెన్సీ మేనేజర్ టి. శేఖర్ సూచించారు. పాలకొల్లులో గోల్డ్ మార్కెట్ వద్ద జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా గోల్డ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు సాంస్కృతిక పోటీలు ఘనంగా నిర్వహించారు. స్థానిక చిన్నారులు ఎంతో ఉత్సాహంగా సాంస్కృతిక పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారుల ప్రదర్శనలు ప్రేక్షకులను వారి తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఏజెన్సీ మేనేజర్ టి. శేఖర్ అధ్యక్షతన వహించారు. లైఫ్ మిత్ర కె.ఎస్.ఎస్.కె. గుప్తా మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు మంచి ఆర్థిక ప్రణాళిక రూపొందించు కోవటం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. గోల్డ్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు శేర్ తుకారం మాట్లాడుతూ పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.. సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ముఖ్య అతిధులు, కమిటీ పెద్దలతో కలిసి బహుమతులు అందజేశారు. విజేతలను అభినందించి పిల్లలు మరింత ఉత్సాహంతో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని అయన ఆకాంక్షించారు.గోల్డ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కాదా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వింజరపు విజయ్, కార్యదర్శి కంది శ్రీనివాస్, కోశాధికారి కలిశెట్టి మోహన్, ఆలయ చైర్మన్ గోపి తదితరులుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రైతు ఆర్థిక పురోగతే సహకార సంఘ లక్ష్యం సొసైటీ అధ్యక్షుడు నామా కొండబాబు



**తాళ్లపూడి,సెప్టెంబర్ 22, ప్రజాజ్యోతి న్యూస్** ది తాడిపూడి విశాల సహకార పరపతి సంఘం మహాజన సభ మంగళవారం సంఘ కార్యాలయంలో అధ్యక్షులు నామా వెంకట సుబ్బారావు (కొండబాబు)అధ్యక్షతన జరిగింది.ఈ సభలో కొండబాబు మాట్లాడుతూ రైతు సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతు ఆర్థికంగా బలపడితేనే గ్రామం, దేశం అభివృద్ధి చెందుతుందని, అందుకే రైతులకు అండగా నిలవడానికే సొసైటీలు పనిచేస్తున్నాయని చెప్పారు. సొసైటీ ద్వారా రైతులకు అందుతున్న సేవలను ఆయన వివరించారు. ప్రస్తుత సీజన్ లో రైతులకు యూరియా కొరత రాకుండా ముందుగానే నిల్వలు ఉంచి పంపిణీ చేస్తున్నామని, పంట రుణాలు (క్రాప్ లోన్లు) సకాలంలో అందజేస్తున్నామని తెలిపారు. సంఘంలో లాకర్ వసతితో పాటు డిపాజిట్ సదుపాయం కూడా ఉందని, సభ్యులు ఫిక్సడ్ డిపాజిట్లు చేసి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న గోడౌన్ స్థలం సరిపోకపోవడం తదితర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఈ నేపథ్యంలో నూతన గోడౌన్ నిర్మాణం ఆవశ్యతను గుర్తించామని నూతన గోడౌన్ నిర్మాణానికి సంబంధించి డిసిసిబి చైర్మన్ తో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నామా రంగనాయకులు, గొంతి రమేష్, మాజీ సర్పంచ్ లింగంపల్లి సత్యనారాయణ,సొసైటీ ఇంచార్జి సీఈఓ తిరుమలశెట్టి పవన్ కుమార్, టీడీపీ యువ నాయకులు సిద్ధన రాధాకృష్ణ, తిరుమలశెట్టి సత్యనారాయణ, సొసైటీ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

# త్రాగునీటి సంపు ప్రారంభోత్సవం



**హొళగుంద, సెప్టెంబర్ 22, ప్రజా జ్యోతి న్యూస్ -**మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు త్రాగునీటి అవసరాలను తీర్చేందుకు జిల్లా పరిషత్ నిధులు, మండల పరిషత్, గ్రామపంచాయతీ నిధుల ద్వారా దాదాపు 45 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన త్రాగునీటి సంపు, హెచ్ది పైప్ లైన్, 30 హెచ్.పీ మోటర్ను ఎంపీపీ నూర్జహాన్ బి అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, ఎంపీటీసీ సభ్యులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి ప్రత్యేక నిధులు త్రాగునీటి సంపు నిర్మాణం చేపట్టుటకు 20 లక్షల వరకు సమకూర్చడంతో, మండల పరిషత్ 5 లక్షల నిధులతో మోటరు, పంప్ హౌస్, మేజర్ గ్రామపంచాయతీ 20 లక్షల నిధులతో హెచ్ది పైప్ లైన్ నిర్మాణం చేపట్టి ప్రారంభించడం జరిగిందన్నారు. అదేవిధంగా గతంలో కేవలం ఒక ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ ద్వారా ప్రజలకు త్రాగునీటి అవసరాలు తీర్చడం జరిగేదని తెలియజేశారు. నేడు అదనంగా నూతనంగా నిర్మాణం చేపట్టిన పైప్ లైన్, పంప్ హౌస్ ద్వారా ప్రజలకు త్రాగునీటి అవసరాలు తీరనున్నాయని అన్నారు. నిధులు మంజూరు చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డికి, అధికారులకు మండల ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ షఫీయుల్ల, ఎంపీపీ తనయుడు ఈసా, వైసీపీ సీనియర్ నాయకులు శేషప్ప, హనుమప్ప, ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున, శివన్న, సంధ్య భాయ్, రత్నమ్మ, ఎస్కే గిరి,మాజీ ఎంపీటీసీ సభ్యులు కేంచప్ప, సింగల్ విండో మాజీ అధ్యక్షులు మల్లికార్జున, అడ్లిగి మల్లయ్య, సిద్ధప్ప, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్ల సేవలకు వీడ్కోలు

**ఎంపీపీ చిన్నపోతుల హరిబాబుకు ఘన సన్మానం**



**బాపట్ల సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఐదేళ్ల పదవీకాలంలో బాపట్ల మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ, అధికారులు--ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని ప్రగతిపథంలో నడిపించిన ఘనత ఎంపీపీ చిన్నపోతుల హరిబాబుకే దక్కుతుందని ఎంపీడీవో బాబురావు కొనియాడారు.మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పదవీకాలం పూర్తిచేసుకున్న ఎంపీపీ చిన్నపోతుల హరిబాబుతో పాటు ఉపాధ్యక్షురాలు రమాదేవి, ఎంపీటీసీ సభ్యులకు ఘనంగా వీడ్కోలు పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎంపీపీ హరిబాబు అధికారులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సమన్వయంతో ముందుకు సాగారని తెలిపారు.అనంతరం ఎంపీపీ హరిబాబు మాట్లాడుతూ తన ఐదేళ్ల పదవీకాలంలో మండల అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి సహకరించిన అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పదవిలో ఉన్న సమయంలో అందరి సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేసినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పల్నాటి శ్రీరాములు, పరిపాలన అధికారి చక్రధరరావు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫైల్ నెంబర్1 ముత్తుకూరు.

**ఆశా కార్యకర్త నియామకానికి దరఖాస్తులు పంపండి.**

**ముత్తుకూరు, సెప్టెంబర్ 22( ప్రజా జ్యోతి)** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముత్తుకూరు 3 సచివాలయానికి చెందిన గ్రామాలలో పనిచేయుటకు ఆశా కార్యకర్త నియామకం జరుగుతుందని దరఖాస్తులు పంపుకోవాలని వైద్యాధికారిణి దేవి కృప తెలిపారు. మంగళవారం మెడికల్ ఆఫీసర్ మాట్లాడారు. విద్యార్హత 10 తరగతి పాస్ అయి ఉండాలన్నారు. 25 సంవత్సరాలు వయస్సు నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన ఆ గ్రామాలకు చెందిన వివాహితులు,, వితంతువులు,, సెపరేట్ ఉమన్స్ మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబర్ 26 తేది సాయంత్రం లోగా ముత్తుకూరు పి.హెచ్.సి లోని ఆశ నోడల్ ఆఫీసర్ ఉషకి అందచేయాలని చెప్పారు.

## చెన్నూరు లో భారీ వర్షాలు

**పెన్నా నదిలో పెరుగుతున్న నీటి ఉధృతి**



**చెన్నూరు , సెప్టెంబర్ ,22,** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా చెన్నూరు మండలం వ్యాప్తంగా మూడు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి, సోమవారం రాత్రి మంగళవారం ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది, సోమవారం రాత్రి 21,4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది, భారీ వర్షం కురవడంతో మండల వ్యాప్తంగా రైతులు సాగు చేస్తున్న తమలపాకు పసుపు ఇతర పంటలకు ఊరట లభించింది, ప్రజలు రైతులు భారీ వర్షంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు, పెన్నా నది కుందునది ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో కుందూ నది వరద పోటెత్తాడంతో పెన్నా నదిలోకి భారీగా నీరు వచ్చి చేరుతున్నది, ఆదినిమాయపల్లి ఆనకట్ట వద్ద జలకల సంతరించుకుంది, ఆది నిమ్మాయిపల్లి ఆనకట్ట నుంచి దిగువ పెన్నా నదికి భారీగా నీరు వచ్చి చేరుతున్నది, చెన్నూరు వద్ద మంగళవారం సాయంత్రానికి 6 వేలు క్యూసెక్కులు పెన్నా నదిలో ప్రవహిస్తున్నది, పెన్నా నదికి వరద నీరు వచ్చి చేరడంతో పెన్నా నది పరిసర ప్రాంతాల వ్యవసాయ బోర్లు తాగునీటి బోర్లలో నీటిమట్టం పెరుగుతున్నది,

## చౌక దుకాణాల తూకం మిషన్లు ( వెయిట్ మిషన్లు) పరిశీలన

**అవకతవకవులు జరగకుండా చర్యలు**

**తూనికలు కొలతలు ఇన్స్పెక్టర్ ఎం రమేష్ కుమార్ రెడ్డి**



**చెన్నూరు , సెప్టెంబర్ ,22,** ప్రజలకు చౌక దుకాణాల తూకం కమిషన్ల( వెయిట్ మిషన్లు) ద్వారా నిత్యవసర వస్తువులు అందించే తూకం మిషన్ల ద్వారా అవకతవకవులు జరగకుండా చర్యలు తీసుకునేందుకు మిషన్ల పరిశీలించడం జరిగిందని తూనికలు కొలతలు ఇన్స్పెక్టర్ ఎం వి రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు, చెన్నూరు తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం చౌక దుకాణాల తూకం మిషన్లను పరిశీలించి తూకంలో తేడా లేకుండా సరి చేశారు, డీలర్లు అవకతవకలు పాల్పడకుండా కట్టుదిద్దంగా భద్రత కల్పించారు, ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తూకం మిషన్లు సరి చేయాల్సి వస్తుందని తెలిపారు, చెన్నూరు మండల వ్యాప్తంగా 26 తూకం మిషన్లు ఉండగా ఇప్పటివరకు 20 వాటికి పరిశీలించి తూకాలు సరిచేసి చేయడం జరిగింది అన్నారు, తూనికలు కొలతలు సిబ్బంది డీలర్లు రెవిన్యూ సిబ్బంది ఉన్నారు,

## బస్సు ఢీ కొని కూరగాయల వ్యాపారి మృతి

**– నర్సాపురం జంక్షన్ వద్ద చోటుచేసుకున్న ఘటన**





**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండలం నరసాపురం జంక్షన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లోలుగు గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి కన్నం నాయుడు మృతి చెందాడు. కూరగాయలు తీసుకుని శ్రీకాకుళం వెళ్తుండగా బస్సు ఢీకొనడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన కన్నం నాయుడు కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు.మంగళవారం తెల్లవారుజామున కూరగాయలు తీసుకుని శ్రీకాకుళం వెళ్తుండగా నరసాపురం జంక్షన్ వద్ద ప్రమాదం సంభవించింది.శ్రీకాకుళం నుంచి చిలకపాలెం మీదుగా వస్తున్న బస్సు కన్నం నాయుడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.మృతుడి భార్య లోలుగు లక్ష్మీ ఇచ్చిన పిర్యాదు మేరకు స్థానిక ఎస్.ఐ రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి , దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనతో లోలుగులో విషాదఛాయలు అలముకున్నాయి.

## తుఫాన్ నేపథ్యంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

**– మహారాజా మార్కెట్ ఆవరణలో యంత్రాలతో చెత్త తొలగింపు**

**– పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపీడీవో ఎస్ వాసుదేవ రావు**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** తుఫాన్ ప్రభావం నేపథ్యంలో పొందూరు మండల కేంద్రంలో పారిశుధ్య పనులకు అధికారులు ప్రాధాన్యం కల్పించారు. ఇందులో భాగంగా స్థానిక మహారాజా మార్కెట్ ఆవరణలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను మంగళవారం చేపట్టారు. పంచాయతీ ఈవో పొన్నాడ జగదీష్ పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు యంత్రాల సహాయంతో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఎస్ వాసుదేవ రావు పారిశుధ్య పనులను పరిశీలించారు ..మార్కెట్ పరిసరాలు, రోడ్లపై చెత్త తొలగింపు ప్రక్రియను పరిశీలించి, తుఫాన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య నిర్వహణపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు.తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పారిశుధ్య లోపాల కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు ఎంపిడిఓ తెలిపారు. మార్కెట్ పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు.ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.

## జాతీయ పోషణ మాసోత్సవం



**నందవరం సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా ఎమ్మిగనూరు ఐసిడిఎస్ సిడిపిఓ సఫర్నిసా బేగం,సూపర్వైజర్ గుణశేఖరమ్మ ఆదేశాల మేరకు చిన్నారులు,గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మిదేవి,జయంతి, లలిత లు అవగాహన కల్పించారు.పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అంగన్వాడీ సిబ్బంది వివరించారు. చిన్నారులకు సమతుల ఆహారం అందించడం,పరిశుభ్రత పాటించడం,రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం అంగన్వాడి సిబ్బంది,చిన్నారులు,తల్లులు తో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సహాయకులు,తల్లులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు వేదికగా విద్యార్థుల పోటీలు



**హోళగుంద,సెప్టెంబర్ 22, ప్రజా జ్యోతి న్యూస్ –** హెబ్బటం కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శ్రీ భీమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. రన్నింగ్, కబడ్డీ, స్కిప్పింగ్, డ్రాయింగ్, రైటింగ్, సింగింగ్, రైమ్స్ తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, ప్రతిభతో పాటు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు హెచ్.వై. శేషాద్రి, సుంకన్న, విమలమ్మ, జంబునాథ, నీలకంఠం, కృష్ణ నాయక్, శ్రావణి, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, పీడీలు, సీఆర్‌ఎంటీ లక్ష్మప్ప తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

# కర్నూలులో ఘనంగా ప్రారంభమైన గణేష్ నిమజ్జన శోభాయాత్ర.

**రాంబొట్ల దేవాలయంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శోభయాత్రను ప్రారంభించిన**

**మంత్రి టి.జి. భరత్, కలెక్టర్ డా. ఎ. సిరి ,**

**ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే గౌరీ చరిత.**



**కర్నూలు సెప్టెంబర్ 22 ( ప్రజా జ్యోతి, స్టాఫ్ రిపోర్టర్ )** నగరంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా ప్రారంభమైంది.మంగళవారం నిమజ్జనోత్సవాల సందర్భంగా మొదటగా నగరంలోని ప్రసిద్ధ రాంబొట్ల దేవాలయ గణపతిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ టి.జి. భరత్,జిల్లా కలెక్టర్. డా.ఎ. సిరి,జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, పాణ్యం ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరిత, మాజీ ఎమ్మెల్యే శ్రీ ఎస్.వి. మోహన్ రెడ్డి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.?అనంతరం పాతబస్తీ మీదుగా కొనసాగుతున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రను కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ కాలినడకన పర్యటించి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.వినాయక నిమజ్జనం పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ ఎస్పీ గారి తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా,సిఐలు మధుసూదన్ రావు కేశవరెడ్డి, మారుతి శంకర్, రామయ్య నాయుడు,ఎస్సై. ఖాజావలి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటి పైకప్పు కూలడంతో నిరాశ్రయుడైన వృద్ధుడు దాతల సాయం కోసం ఎదురుచూపు





**తాళ్లపూడి, సెప్టెంబర్ 22, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామం చిలకంపేటకు చెందిన జల్లు తిరుపతిరావు అనే వృద్ధుడి ఇల్లు ఇటీవల వీచిన తుఫాన్ ఈదురుగాలులకు పూర్తిగా ధ్వంసమైంది.ఆయన నివసిస్తున్న పెంకుటిల్లు పైకప్పు పూర్తిగా కూలిపోయి శిథిలమై నివాసానికి పనికిరాకుండా పోయింది. ఒక్కసారిగా ఇల్లు శిథిలమవడంతో నిలువ నీడ లేక ఆయన నిరాశ్రయుడయ్యాడు.వయోభారం, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న తిరుపతిరావుకు ఇల్లు మరమ్మతు చేయించుకునే స్తోమత లేదు. దీంతో ప్రస్తుతం అదే ఇంటి వరండాలో ఒక మూలన రేకు కిందతలదాచుకుంటూ దయనీయ పరిస్థితిలో కాలం వెళ్లదీస్తున్నాడు. వర్షం వస్తే తడిసిపోతూనే ఆ రేకు కిందే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. స్థానికులు, దాతలు, ప్రజాప్రతినిధులు స్పందించి వృద్ధుడికి నిలువ నీడ కల్పించాలని ప్రభుత్వం స్పందించి సాయం అందించాలని కోరుతున్నారు

## శ్రీ శివరామానంద ఆశ్రమంలో భగవద్గీత పారాయణం..........



**చాగలమర్రి సెప్టెంబర్ 22( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రిలో శ్రీ శివరామానంద ఆశ్రమంలో ఏకాదశి సందర్భంగా మహిళలందరూ భగవద్గీత పారాయణం పటించారు.శ్రీ కృష్ణునికి విశేష పూజలు జరిపి హారతులు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తొమ్మండ్రు సుభాషిణి యల్లంపల్లె లక్ష్మీదేవి మిట్టా అనిత కటకం అపర్ణ సత్యావతి, అనూష రమ,పరమేశ్వరి పాల్గొన్నారు.

## సముద్ర తీర ప్రాంతాల్లో తహసిల్దార్ చిన్నారావు పర్యటన తుఫాన్ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



**యు.కొత్తపల్లి, (ప్రజా జ్యోతి)**తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండల తహసిల్దార్ జి. చిన్నారావు మంగళవారం ఉదయం సముద్ర తీర ప్రాంతాల్లో పర్యటించారు. ఉప్పాడ సముద్ర ప్రాంతంతో పాటు కొత్తపట్నం, సుబ్బంపేట, సూరాడపేట, మాయాపట్నం, జగ్గరాజుపేట తదితర తీర ప్రాంతాలను ఆయన తన సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుబ్బంపేట నుండి ఎస్పీజీఎల్ శివారు వరకు కాలినడకన పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ చిన్నారావు మాట్లాడుతూ.. రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, సముద్రం ఉవ్వెత్తున ఎగసిపడే ప్రమాదం ఉన్నందున తీర ప్రాంత ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతానికి వాతావరణం ప్రశాంతంగానే ఉన్నప్పటికీ, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలకు ఏ రకమైన అత్యవసర సహాయం కావాలన్నా తక్షణమే అధికారులను సంప్రదించవచ్చని, ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ మండల స్థాయి అధికారులను ఇన్చార్జిలుగా నియమించినట్లు వెల్లడించారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లకూడదని, ఇప్పటికే వేటకు వెళ్లిన వారు వెంటనే తిరిగి రావాలని ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో తహసిల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు పట్టణంలో అభివృద్ధికి 31 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్ రెడ్డి



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 22(ప్రజా జ్యోతి ):** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ( హెచ్ ఏ ఎం) ప్రాజెక్టుల వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.ముందుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎస్బిఐ సర్కిల్ నుంచి కుర్ని కళ్యాణ మండపం వరకు ర్యాలీగా చేరుకున్న ఎమ్మెల్యే గారు, అనంతరం సభా వేదికపై జ్యోతి ప్రజ్వలన చేశారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించగా, అందులో భాగంగా ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి ?31 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బీవీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎమ్మిగనూరు పట్టణంలో రోడ్ల అభివృద్ధి, మురుగునీటి కాలువల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, తాగునీటి పైప్‌లైన్ల మెరుగుదల మౌలిక వసతుల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందిస్తూ, ఎమ్మిగనూరు పట్టణాన్ని ఆధునిక వసతులతో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనిఎమ్మెల్యే బీవీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి,ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ మల్లయ్య, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మిన్నప్ప, పట్టణ టీడీపీ అధ్యక్షులు మాచాని మహేష్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, వార్డు కమిటీ నాయకులు, మహిళలు, ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధి ధ్యేయం మా లక్ష్యం



**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**

**గుంతకల్లు సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):** పట్టణ అభివృద్ధి మా ధ్యేయమని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక అజంత సర్కిల్లో మున్సిపాలిటీ అర్బన్ చాలెంజ్ ఫండ్ 39 కోట్ల రూపాయలతో భూమి పూజ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి హాజరై అనంతరం ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ ?తాగునీటి వ్యవస్థ బలోపేతం గుంతకల్లు పట్టణంలోని వార్డులలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేలా పైప్‌లైన్‌ల మరియు ఇంటింటికి మంచి నీటి కొళాయి నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. నిల్వ ట్యాంకుల ఆధునీకరణ? అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మురుగు నీటి కాలువలు పట్టణంలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయడం జరిగింది నీ అన్నారు.బిటి మరియు సీసీ రోడ్ల నిర్మాణం ప్రజల రాకపోకల కు ఇబ్బంది లేకుండా ప్రధాన రహదారులు అంతర్గత వీధుల్లో కొత్త రోడ్ల నిర్మాణం మరమ్మతులు పట్టణ అందాలీకరణ ఎల్ ఈడీ వీధిదీపాలు వీధిదీపాల ఏర్పాటుతో పాటు కీలక కూడళ్ల ఆధునీకరణ గుంతకల్లు పట్టణాన్ని అన్ని రంగాల్లో మోడల్ గుంతకల్లు మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే మా ధ్యేయంనీ అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా విడుదలైన రూ. 39 కోట్ల నిధులతో పట్టణ రూపురేఖ లు మారబోతున్నాయినీ తెలిపారు. గత కొంతకాలం గా ఉన్న తాగునీరు రోడ్లు డ్రైనేజీ సమస్యలకు ఈ పనుల ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందినీ అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి, మున్సిపల్ ఇంజనీర్ ఇంతియాజ్, టిపిఆర్ఓ గుడిసిమోహన్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బిఎస్ కృష్ణారెడ్డి, బిజెపి నాయకులు, హరిహర నాథ్, తెలుగు దేశం పార్టీ నాయకులు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, అంజలి, గుమ్మనూరు వెంకటేశులు, బండారు ఆనంద్, వాసగిరి మణికంఠ, తలారి మస్తానప్ప, సంజీవ రాయుడు, పూల రమణ, మాజీ కౌన్సిలర్లు, గుంతకల్లు పట్టణం మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెల్దుర్తి పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలి సిపిఐ



**వెల్దుర్తి సెప్టెంబర్ 22 ( ప్రజా జ్యోతి )** పట్టణంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు ఫాగింగ్ పొగను ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు కోరారు. దోమల వల్ల టైఫాయిడ్, మలేరియా,డెంగ్యూ,వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో ఫాగింగ్ మరియు బ్లీచింగ్ పౌడర్ కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి రహమత్ భాష సార్‌కు సిపిఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి.కృష్ణ, సిపిఐ పట్టణ కార్యదర్శి గిరిబాబు,పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు,చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు అనిల్,సిపిఐ సీనియర్ నాయకులు డి.రాజు రైతు సంఘం నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో జనసేన నేత కడారి తమ్మయ్య నాయుడు నివాసానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పిఠాపురం నియోజకవర్గ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గొల్లప్రోలులోని జనసేన పార్టీ ముఖ్య నాయకులు, మాధురి విద్యాలయాల డైరెక్టర్ కడారి తమ్మయ్య నాయుడు నివాసానికి విచ్చేసారు. మంగళవారం ఉదయం తమ్మయ్య నాయుడు ఆహ్వానాన్ని మన్నించి పవన్ కళ్యాణ్ వారి గృహాన్ని సందర్శించారు.తమ ప్రియతమ అధినేత, డిప్యూటీ సీఎం తమ ఇంటికి రావడం పట్ల కడారి తమ్మయ్య నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ పవన్ కళ్యాణ్ కి సాదర స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ పై ఉన్న అమితమైన అభిమానంతో తాము ఆహ్వానించగా, ఆయన తమ ఆహ్వానాన్ని గౌరవించి తమ ఇంటికి రావడం పరమ సంతోషాన్ని ఇచ్చిందని తమ్మయ్య నాయుడు పేర్కొన్నారు. అనంతరం నాయుడు నివాసంలో పవన్ కళ్యాణ్ కొంత సమయం గడిపారు. కాసేపు వారి కుటుంబ సభ్యులతో ఆప్యాయతంగా ముచ్చటించారు.

## డోన్,వైయస్సార్ బుగ్గనకు రీకౌంటర్ ఇచ్చిన టిడిపి నాయకులు



**డోన్( ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 22** మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం మాట్లాడిన మాటలకు టిడిపి నాయకులు రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సలిందర్ శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ్, బేతంచర్ల ఎల్ల నాగయ్య, మంగళవారం ఉదయం 12:30 గంటలకు ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ,నీకు మతి తప్పి పోయింది కనుక, కే ఈ, కోట్ల, టిడిపి గురించి మాట్లాడుతున్నావ్ మీ అహంకారం కల్లబొల్లి మాటలు మార్చుకోకుంటే రాజకీయంగా పుల్ స్టాప్ పడుతుందని హితవు పలికారు, రేకుల షెడ్డు అభివృద్ధి నీది, మా ప్రభుత్వం తల్లికి వందనం ఎన్టీఆర్ భరోసా, ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్, దీపం పథకం కింద ఉచిత సిలిండర్, శ్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతినెలా ఒకటో తారీకు వచ్చిన వెంటనే తెల్లవారుజామునే స్వయంగా నాయకులు ఇంటింటికి పించనివ్వడం జరుగుతుంది, ఇదే కాకుండా సీఎం రిలీఫ్ ఫండ్ కింద పది కోట్లు ప్రజలకు మా ఎమ్మెల్యే ఇవ్వడం జరిగింది, మేము గాజు తోడుకోలేదు అని అంటున్నావ్ మహిళలు అంటే నీకు ఎందుకు అంత అలుసు, మహిళలు అంటే స్త్రీ శక్తి మాత తో సమానం వాళ్ళని కించపరిచి మాట్లాడుతున్నావు వాళ్ల శాపం కొట్టుకొని అడ్రస్ లేకుండా పోతావు, దొరపల్లె ఉడుములపాడు జగనన్న కాలనీలో 60 కోట్లు అవినీతి చేశారు మేము చర్చ కి సిద్ధం మీరు సిద్ధమా,రైతులు దగ్గర ఆరు లక్షలు తీసుకొని ప్రభుత్వం నుండి 15 లక్షలు తీసుకుంటావా, వైసిపి పార్టీ ఎజెండా దోచుకోవడం దాచుకోవడం మీ పార్టీ నాయకుడు దోచుకోవడం దాచుకోవడం ఎలాగో మీరు కూడా అదే దారిలో నడుస్తున్నారు,కోట్ల రూపాయలతో డోన్ మరియు బేతంచెర్ల రోడ్ల అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించాము, మీరు మెయిన్ రోడ్ లో 2 వేసి అభివృద్ధి అంతా నేనే చేశాను అని చెప్పుకుంటున్నావు అది అభివృద్ధి అయితే ఎందుకు నిన్ను ప్రజలు గోరంగా ఓడించారు, ఇప్పుడు కన్నా తెలుసుకో రాజారెడ్డి, ఢిల్లీలో వ్యాపారం చేసుకుంటూ ఉన్నావు,నిన్ను ప్రజలు మరిచిపోతారేమోనని నెలకు ఒకసారి డోన్ కి వచ్చి ప్రెస్ మీట్ పెట్టి ఏదో ఒకటి మాట్లాడి బురదజల్లి వెళ్లిపోతావు నువ్వు ప్రజల చేత తిరస్కరించబడిన నాయకుడివి, మీ పరిపాలనలో భూకబ్జాలు, మట్కా,గంజాయి, అక్రమ మద్యం, రౌడీయిజం పెట్టింది పేరు కాదా, మీరు మాట్లాడేది కోట్ల గురించి ఆయన ఒక సీఎం కొడుకు ఆ కుటుంబానికి ఒక చరిత్ర ఉంది అని మీరు తెలుసుకోండి, మాకూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలలో 47 చెరువులకు నీళ్లు ఇచ్చిన ఘనత మా ఎమ్మెల్యే ది, ఎల్ ని నో ప్రభావం ఉన్న డోన్,నియోజకవర్గ ప్రజలకు త్రాగునీరు లోటు లేకుండా చూసుకుంటున్నాడు, మా నాయకుడు, మా అజెండ కూడు, గుడ్డ ,నీడ, సిద్ధాంతాలతో పుట్టిన పార్టీ, మీ అజెండా అవినీతితో పుట్టిన పార్టీ,టౌన్ నడి సెంటర్లో నాలుగు బిల్డింగులు కట్టి అంతా అభివృద్ధి చేశాను అంటే సరిపోదు, టౌన్ లో శ్రీనివాస్ నగర్ కొత్త బస్టాండ్ ఏరియా పల్లెటూర్ల కంటే అధ్వానంగా ఉన్నాయి వీధులు,రోడ్డు లేక, డ్రైనేజీ కాలువ లేక, రోడ్డు నడి సెంటర్లో పిల్ల కాలువలు పెట్టి ప్రజలు, స్కూలు విద్యార్థులు, ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు అవి కనిపించలేదా మీకు అప్పుడు,అదేనా మీ అభివృద్ధి అంటే, గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులు అడ్డుపెట్టుకొని నామినేషన్లు కూడా వేయించలేదు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ,మున్సిపాలిటీలో, ప్రజల చేత ఎన్నుకోబడకుండా, డబ్బులుఇచ్చిన వాళ్లకే పదవులు, వాళ్లే నాయకులు, ఇదే మీ ఘనత ,

# కొనసాగుతున్న గణేష్ నిమజ్జనం

**కర్నూలు కొండారెడ్డి బురుజు పై నుండి స్వయంగా పర్యవేక్షించిన,కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు.**



**కర్నూలు సెప్టెంబర్ 22 ( ప్రజా జ్యోతి, స్టాఫ్ రిపోర్టర్ )** కర్నూలు నగరంలో డ్రోన్ కెమెరాల లైవ్ ద్వారా నిరంతర నిఘా.ప్రశాంత వాతావరణంలో పోలీసుల పటిష్ట నిఘా.నగరంలో మంగళవారం అంగరంగ వైభవంగా కొనసాగుతున్న వినాయక నిమజ్జన శోభాయాత్రను కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.?ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్,గడియారం ఆసుపత్రి మీదుగా సాగే ఊరేగింపు రూట్‌ను పరిశీలించారు. అనంతరం కొండారెడ్డి బురుజు పైకి వెళ్లి,అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా శోభాయాత్ర ను ప్రధాన కూడళ్లలోని ట్రాఫిక్ క్రమబద్ధీకరణను మరియు భక్తుల జనసందోహాన్ని స్వయంగా వీక్షించి భద్రతా చర్యలను సమీక్షించారు.?ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని,ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా నిమజ్జనం సాఫీగా పూర్తయ్యేలా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యవేక్షణలో ఎస్పీ గారి వెంట నంద్యాల ఏఎస్పీ సుస్మిత, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు,సీఐలు మధుసూదన్ రావు,కేశవరెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# అనంతపురం జిల్లా కరువు జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**50 సంవత్సరాలు ఉన్న ప్రతి రైతుకు పదివేలు పింఛన్ ఇవ్వాలి**

**ఇన్పుట్ సబ్సిడీ, ప్రీమియం ప్రభుత్వమే కట్టాలి**

**రైతు కూలీ సంఘం గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య**



**గుంతకల్లు సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):** రైతులు పండించిన పంటలు ఎండిపోయి పశువులకు మేత కూడా లేదని అందుకే 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పదివేలు పింఛన్ ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు విపక్షాల ఆధ్వర్యంలో సామూహిక దీక్షలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షతగా సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్ వ్యవహరించారు.ఈ దీక్ష కు ముఖ్య అతిథిగా రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య హాజరై వారికి సంఘీభావం తెలిపి అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంట ఎండిపోయి పశువులకు మేత కూడా లేదు 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పదివేలు పింఛన్ ఇవ్వాలని అన్నారు. హంద్రీనీవా ద్వారా పంట పొలాలకు నీరు ఇవ్వాలి నీ మనం డిమాండ్ చేస్తుంటే సీఎం చంద్రబాబు నాయుడు లైనింగ్ పనులు మొదలుపెట్టాడునీ అందుకే ప్రతి మండలంలో పెద్ద పెద్ద రిజర్వాయర్ల కాకుండా చిన్న చిన్నవి రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తే వర్షం వచ్చినప్పుడల్లా అవి నిండి రైతులకు కష్ట కాలంలో రైతులు పంటలు పండించుకోవడానికి వీలుగా ఉంటుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర రైతులుకు సబ్సిడీ ఎఇన్సూరెన్స్, ప్రీమియం, గత ప్రభుత్వంలో జగన్ రైతులకు ఆ ప్రభుత్వమే కట్టిందని గుర్తు చేశారు. కానీ రైతులకు ఈ ప్రభుత్వం చేయడం లేదని అన్నారు. భారతదేశంలో ప్రతి ఒక్కరికి అన్నం పెట్టే రైతన్నలకు చేస్తే ఆర్థిక సంక్షేమం వస్తుందంట అదే నరేంద్ర మోడీ ప్రభుత్వం బడ వ్యాపారం చేసే వారికి బంగారం, వజ్రాలు వ్యాపారం చేసే వారికి 1.50 కోట్ల రూపాయలు వారికి మాత్రమే రాయితీ సబ్సిడీ అందిస్తున్నాయని మండిపడ్డారు. భవిష్యత్తులో వందకి 60 శాతం వ్యవసాయం మీద ఆధారపడుతున్నారూ భవిష్యత్తులో ఆహార ధాన్యం సమస్య రాబోతుందని వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని వ్యవసాయం కాపాడాలంటే రైతులను కాపాడాలి రైతు పంటలు నష్టపోయారు. వారికి ఎకరాకి 50 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు బ్యాంకు రుణాలు రెండు లక్షల రూపాయలు రద్దు చేయాలని తెలంగాణలో, కర్ణాటకలో, తమిళనాడులో రైతులు బ్యాంకులో రద్దు చేసిందని మరి చంద్రబాబునాయుడు ఎందుకు చేయలేదని అన్నారు.అందుకే రాజకీయాలకు అతీతంగా మన సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని ఆ దిశగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి గోవిందు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి మహేష్, సిపిఐ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, ఏఐటియుసి మండల అధ్యక్షులు కార్యదర్శులు దాసరి శీన, ఈశ్వరయ్య, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పిసి కుల్లాయప్ప, ఉమర్ భాష, సిపిఎం రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు విరుపాక్షి, ఐ ఎఫ్ టి యు నాయకులు రామాంజనేయులు ,మస్తాన్ ,భాష, వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజనేయులు, రైతుబంధు నాయకులు బాబురావు, మండల కార్యదర్శి రాము, భాషిత్, జయరాం రెడ్డి, మల్లికార్జున శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# డోన్ అభివృద్ధికి మరో ముందడుగు

**రూ.21 కోట్లతో 13.18 కి.మీ. మేర రహదారుల అభివృద్ధి**



**డోన్:సెప్టెంబర్22,(ప్రజా జ్యోతి)**పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా డోన్‌లో రహదారుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో రూ.21 కోట్ల అంచనా వ్యయంతో 13.18 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయనున్నారు. అదేవిధంగా బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలో రూ.17 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కూడా ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా పనులను ప్రారంభించారు. కార్యక్రమం లో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధం గా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశలవారీగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. రహదారుల అభివృద్ధి పూర్తయితే డోన్ పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయన్నారు నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, డోన్ కమిషనర్ అధికారులను కూటమి నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామం నుండి వైసీపీ అభ్యర్థి ఉండాల్సిందే

**– మాజీ ఎమ్మెల్యే తలారి పిలుపు**

**. వైసిపి గుర్తింపు కార్డులు పంపిణీ**



**తాళ్లపూడి ,సెప్టెంబర్ 22, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గుర్తింపు కార్డుల పంపిణీ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తకు గుర్తింపు కార్డు ఇవ్వడం వైసీపీ కుటుంబంలో సభ్యుడివని జగనన్న స్వయంగా చెప్పినట్లే అని అన్నారు.త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి గ్రామం నుండి మన అభ్యర్థి ఉండాల్సిందేనని, ఒక్క గ్రామాన్ని కూడా వదలొద్దని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.డబ్బు లేదు, ఎదుటివాళ్లు బలవంతులు అనే ఆలోచన వద్దని మనకు డబ్బు బలం కాదు జనం బలం ఉందని గతంలో జగనన్న ప్రభుత్వం ప్రతి ఇంటికి అందించిన సంక్షేమ పథకాలే మనకు ఆయుధాలని అన్నారు. పోటీ చేసే ప్రతి ఒక్కరి వెనక పార్టీ అండగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ వంబోలు పోసిబాబు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి గూడా విజయ రాజు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి యాళ్ళ బాబురావు, కొమ్మిరెడ్డి పరశు రామారావు, మాజీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, కొవ్వూరు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు దమయంతి, మండల మహిళా అధ్యక్షురాలు పెండ్యాల మమత, మాజీ ఎంపీపీ కొమ్మిరెడ్డి వీర రాఘవమ్మ, మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పిట్టా శ్రీనివాస్ వ్యవహరించారు

## కరువు సహాయం కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల మద్దతు విడపనకల్‌లో ధర్నా

**–ఈ రోజు కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి.**




**సెప్టెంబర్ 22 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు : –** ఎల్ ని నో ప్రభావంతో,కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు తక్షణమే కరువు సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో,అఖిలపక్ష పార్టీల మద్దతుతో సెప్టెంబర్ 23న విడపనకల్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.విడపనకల్ బస్టాండ్ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి,అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేయనున్నారు.కరువు ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని కోరుతూ చేపడుతున్న ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ పిలుపునిచ్చింది.

# ఎలినినో వేళ రైతుకు అండగా ప్రభుత్వం

## బాపట్ల జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు

**బాపట్ల సెప్టెంబరు 22 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**ఎలినినో ప్రభావంతో జిల్లాలో రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార,పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో వ్యవసాయం, జలవనరులు, ఆక్వా, పరిశ్రమలు తదితర 14 శాఖలపై సమీక్ష నిర్వహించారు.ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన నీటిని అందించాలని, కొత్తగా వరి, పొగాకు సాగును తాత్కాలికంగా నియంత్రించాలని మంత్రి పార్థసారథి సూచించారు. తాగునీటికి కొరత రాకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపాలని, అవసరమైతే బోర్ల ద్వారా నీటిని నింపే చర్యలు చేపట్టాలన్నారు. పట్టిసీమ నుంచి నీటి విడుదల, జిల్లాలోని జలవనరుల పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలినినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడేందుకు అవసరమైన నీటి పరిమాణంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నిండకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. నీటి చౌర్యాన్ని అరికట్టి, అవసరమైతే పోలీసుల సహకారంతో చెరువులను నింపాలని సూచించారు. సాగు చేయలేకపోయిన రైతులు చెల్లించిన పంటల బీమా ప్రీమియం తిరిగి పొందే అంశంపై ప్రభుత్వానికి నివేదిక పంపాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో 15 మండలాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాటిని కరవు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. 13 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటిమట్టం తక్కువగా ఉందని, బోర్ల ద్వారా నీటిని నింపేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఆక్వా, పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాల ద్వారా ఆదాయం పెరిగిందని, రూ.2,200 కోట్ల ఆదాయంతో జిల్లా రాష్ట్రంలో 8వ స్థానానికి చేరిందన్నారు.శాసనమండలి డిప్యూటీ స్పీకర్ తూమాటి మాధవరావు తల్లికి వందనం పథకంలో పెండింగ్‌లో ఉన్న సుమారు 1,400 మంది విద్యార్థులకు నగదు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత ఎలినినో ప్రభావం దృష్ట్యా వీబీజీ రామ్‌జీ పథకం కింద కరవు పనులు పెంచి పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కరవు మండలాల గుర్తింపులో వేమూరు నియోజకవర్గాన్ని కూడా చేర్చాలని, రైతులకు సాధారణ సరఫరాకు అదనంగా ఒక బస్తా యూరియా అందించాలని కోరారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేసి, దిగువ ప్రాంతాలకు సక్రమంగా నీరు చేరేలా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య చీరాలలో



దెబ్బతిన్న ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని, ఏపీఎస్ ఐడీసీ కార్యకలాపాల పర్యవేక్షణకు చీరాలలో అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. చేనేత పార్కు అభివృద్ధితో పాటు జీ రామ్‌జీ పథకం కింద అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.ఆక్వా రంగంపై ఎలినినో ప్రభావాన్ని అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లాకు కొత్త పెట్టుబడులు వచ్చేలా పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ అధికారులు చురుకుగా పనిచేయాలని మంత్రి పార్థసారథి సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో గుండ్లపల్లి కాలనీవాసులు రాస్తారోకో



**కంబదూరు సెప్టెంబర్: 22 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,**కంబదూరు మండల కేంద్రంలోని గుండ్లపల్లి కాలనీలో గత 5 రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో గుండ్లపల్లి కాలనీవాసులు మంగళవారం సాయంత్రం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ గంగాధర అక్కడికి చేరుకుని ప్రజలతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన అనంతరం కాలనీకి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేలా చర్యలు చేపట్టారు. దీంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

## ప్యాపిలి మండలంలోని నల్లబెల్లి సుంకులమ్మ గ్రామం పర్యటన

### ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి



**ప్రజా జ్యోతి న్యూస్ ప్యాపిలి సెప్టెంబర్ 22** మండలంలోని నల్లబెల్లి సుంకులమ్మ దగ్గర ఎర్రగుంట్ల పల్లి బత్తుల రమేష్ రెడ్డి ఎమ్మెల్యే సూర్య ప్రకాష్ రెడ్డిని సుంకులమ్మ దేవాలయం పరిసరాలు సుక్రమంగా లేవని తెలియజేయడంతో వెంటనే ఎమ్మెల్యే సూర్య ప్రకాష్ రెడ్డి వెంటనే ఇక్కడికి రావడం జరిగినది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరిన్ని సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నది అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మంగళవారం రోజు కల చెట్ల గ్రామపంచాయతీ లో మజారా గ్రామమైన నల్లబెల్లి సుంకులమ్మ దేవాలయం దగ్గర మౌలిక వసతులు పరిశీలించడం జరిగినది త్వరలో మరిన్ని మౌలిక సదుపాయాలు ప్రజలకు మరెన్నో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాంతఅభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ ప్రాంతమంతా సుంకులమ్మ అమ్మవారి దర్శనం కోసం ప్రతివారం వేల జనం ఇక్కడికి వస్తుంటారు పూజ చేస్తుంటారని ఇక్కడ నిరంతరం రద్దీగా ఉంటుంది కాబట్టి ఇక్కడ భక్తులకు అన్ని ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేశారు పంచాయితీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు మొదలు పెడతామని తెలిపారు.రానున్న రోజుల్లో కాలువలు, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాంత సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

## భారీ వర్షాల నేపథ్యంలో చింతూరు డివిజన్‌లో 24 7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

**ప్రజల భద్రతకు ప్రాధాన్యత.. వర్షాలు, వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ**



**చింతూరు సెప్టెంబర్ 22 ప్రజాజ్యోతి. ప్రతినిధి.రాజు పూసం** భారీ వర్షాల నేపథ్యంలో చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఏటపాక నాలుగు మండలాల్లో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు, వర్షాలు మరియు వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు 24ఐ7 డివిజనల్, మండల స్థాయి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్టు అధికారి, ఐ.టి.డి.ఏ. సబ్-కలెక్టర్, చింతూరు శుభమ్ నోఖ్వాల్ తెలిపారు. ప్రజల సమస్యలపై తక్షణ స్పందనకు డివిజనల్ కంట్రోల్ రూమ్ చింతూరు ఐ.టి.డి.ఏ. కార్యాలయ సమావేశ మందిరంలో డివిజనల్ స్థాయి 24ఐ7 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, సిబ్బందిని రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా నియమించారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజల నుంచి వచ్చే అత్యవసర సమాచారాన్ని స్వీకరించి, సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేస్తూ సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నామన్నారు..

**కంట్రోల్ రూమ్‌కు అందే ఫిర్యాదులు, సమాచారంలో ప్రధానంగా:**

భారీ వర్షాలు, వరదల పరిస్థితులు. రహదారులపై నీటి ప్రవాహం, రాకపోకలకు అంతరాయం. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు. తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలు. ప్రజల భద్రతకు సంబంధించిన ఇతర అత్యవసర పరిస్థితులు. వంటి అంశాలపై సమాచారం నమోదు చేసి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. నాలుగు మండలాల్లో మండల స్థాయి కంట్రోల్ రూమ్‌లు చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఏటపాక మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో మండల స్థాయి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు . ఆయా మండలాల్లో వర్షాలు, వరదల పరిస్థితులను స్థానిక స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండల స్థాయిలో అందే సమాచారాన్ని సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ శాఖ, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. కంట్రోల్ రూమ్ సంప్రదింపు నంబర్లు డివిజనల్ కంట్రోల్ రూమ్ సబ్-కలెక్టర్ కార్యాలయం, చింతూరు 9490026397 812172 9228 చింతూరు మండల కంట్రోల్ రూమ్ 9492527695 కూనవరం మండల కంట్రోల్ రూమ్ 9652814712 వీఆర్ పురం మండల కంట్రోల్ రూమ్ 8008100892 ఏటపాక మండల కంట్రోల్ రూమ్ 8332085268 ప్రజలకు అధికా రుల సూచనలు భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సమీప కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా వరద ప్రవాహాలు, నీట మునిగిన రహదారులు, ప్రమాదకర ప్రాంతాల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చింతూరు డివిజన్‌లో వర్షాలు, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల భద్రతకు అవసరమైన ముందస్తు చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు సబ్-కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ తెలిపారు.

## నిఘా వ్యవస్థలో పోలీసుల కొత్త అడుగు

**గుంటూరు సెప్టెంబర్ 22 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** నేరాల నియంత్రణ, ప్రజల భద్రతలో సాంకేతికతను మరింత విస్తృతంగా వినియోగించే దిశగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ కీలక అడుగు వేసింది. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షణలో హోటళ్లు, పీజీల్లో బస చేసే వారి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే సేఫ్‌స్టే యాప్, రాష్ట్రవ్యాప్తంగా డ్రోన్లను ఒకే కేంద్రం నుంచి పర్యవేక్షించే కేంద్రీకృత డ్రోన్ పర్యవేక్షణ వ్యవస్థను మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ సాంకేతికతను కేవలం పోలీసుల పనితీరుకు పరిమితం చేయకుండా దాని ప్రయోజనాలను నేరుగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీస్ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు వారి ముంగిటకు చేరేలా పోలీసింగ్‌లో మార్పులు తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు సేఫ్‌స్టే యాప్ ద్వారా హోటళ్లు, పీజీల్లో బస చేస్తున్న వారి వివరాలు పోలీసులకు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోరేందుకు సంకేతం పంపే అవకాశం కూడా ఉంటుందన్నారు. మరోవైపు కేంద్రీకృత డ్రోన్ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని పోలీస్ డ్రోన్ల ప్రత్యక్ష దృశ్యాలను ఒకే నియంత్రణ కేంద్రం నుంచి పర్యవేక్షించవచ్చని వివరించారు. బందోబస్తు, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, పేకాట



వంటి వాటిపై నిఘాకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, నేరాల దర్యాప్తు తదితర రంగాల్లో సాంకేతికతను మరింతగా వినియోగిస్తామని డీజీపీ తెలిపారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ డీజీపీ మార్గదర్శకత్వంలో గుంటూరు జిల్లాలో పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగానికి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేల డ్రోన్లను కేంద్రీకృత వ్యవస్థ ద్వారా పర్యవేక్షించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. దీని ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, అవసరమైన సందర్భాల్లో వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు, హోటల్ రంగ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేవీకే బనవాసిని సందర్శించిన 150 మంది విద్యార్థులు

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలో ని గుడేకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ మరియు 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు సుమారు 150 మంది వృత్తి విద్య మరియు పారిశ్రామిక సందర్శన (ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఇండస్ట్రియల్ టూర్ ) కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే ) బనవాసిని సందర్శించారు.ఈ సందర్భంగా కేవీకే బనవాసి కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. రాఘవేంద్ర చౌదరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, 10వ తరగతి అనంతరం వ్యవసాయ విద్యను అభ్యసించేందుకు ఉన్న వివిధ అవకాశాలను వివరించారు. విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో బైపీసీ ఎంపిక చేసుకుని, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం అనంతరం ఎపసెట్ లేదా ఐసీఆర్ ప్రవేశ పరీక్ష ద్వారా వ్యవసాయ విద్యలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఐసీఆర్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి మంచి ర్యాంక్ పొందిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం స్టైఫండ్, ప్రయాణ మరియు ఇతర అలవెన్సులు లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు.అనంతరం కేవీకే బనవాసి యొక్క విధులు, రైతులకు అందిస్తున్న సేవలు మరియు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేసే విధానాలను విద్యార్థులకు వివరించారు. రైతు శిక్షణ కార్యక్రమాలు, క్షేత్ర ప్రదర్శనలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాలు, విత్తనోత్పత్తి కార్యక్రమాలు, సాంకేతిక సలహాలు మరియు కేవీకే సంస్థాగత నిర్మాణం గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు వర్మీకంపోస్ట్ డెమో యూనిట్, తేనెటీగల పెంపకం డెమో యూనిట్, మట్టి మరియు నీటి పరీక్షా ప్రయోగశాల, విత్తనోత్పత్తి క్షేత్రాలు, క్రాఫ్ట్ క్యాఫెటీరియా మరియు షేడ్‌నెట్ యూనిట్‌లను సందర్శించి వాటి నిర్వహణ, ఉపయోగాలు మరియు వ్యవసాయంలో వాటి ప్రాధాన్యతను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సాయిల్ టెస్టింగ్ టెక్నీషియన్ తేజ కుమార్ మరియు వై.పి. సుధాకర్ పాల్గొని విద్యార్థులకు వివిధ యూనిట్ల గురించి వివరించారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి అండగా ఉంటా

**సంఘం అభివృద్ధికి ఐక్యంగా ముందుకు సాగాలి**

**- ఎర్రకోట రాజీవ్ రెడ్డి.**



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 22(ప్రజా జ్యోతి ):** ఆర్య వైశ్యుల సంక్షేమం, సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానని ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి అన్నారు. నందవరం మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఈరన్న శెట్టి మర్యాదపూర్వకంగా రాజీవ్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ నూతన బాధ్యతలు స్వీకరించిన ఈరన్న శెట్టి సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. సభ్యుల సమస్యలు, సంక్షేమం, సంఘం ఐక్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు.ఈరన్న శెట్టి మాట్లాడుతూ సంఘం సభ్యుల సంక్షేమం, ఐక్యత కోసం కృషి చేస్తానని తెలిపారు. అందరి సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమం లో రాజేష్ శెట్టి, ఉరుకుందయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు

## ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు మృతి

**ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి , సోదరుడు బూసినే వెంకటేష్, నాగరాజు భౌతికకాయానికి నివాళులు**



**హాలహర్వి సెప్టెంబర్ 22, ప్రజాజ్యోతి :-** హాలహర్వి మండలం పచ్చారపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు అనారోగ్యంతో మృతి చెందారు.ఆయన మృతదేహానికి గ్రామస్తులు, స్నేహితులు యువత, ఎల్ ఎల్ సి కాలువ అధికారులు, ఉపాధి అధికారులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి సోదరుడు బూసినే వెంకటేష్ పచ్చారపల్లి గ్రామానికి చేరుకుని నాగరాజు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాగరాజు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అర్ధగేరి శ్రీనివాసులు, వైస్సార్సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, రాఘవేంద్ర రెడ్డి,బాపురం కృష్ణయ్య హాలహర్వి గోపాల్,మధు తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోతులగుట్ట సీ. హెచ్. సీ లో ఖాళీ గా ఉన్న స్పెషలిస్టు వైద్యుల పోస్టులు భర్తీ చేస్తాం

**డీ సీ హెచ్ ఎస్ :డా. సాంబశివరావు**





**కూనవరం సెప్టెంబర్ 22. ప్రజా జ్యోతి** కూనవరం మండలం కోతులగుట్ట సీ. హెచ్. సీ లో ఖాళీ గా ఉన్న స్పెషలి స్టు వైద్యుల పోస్టులను త్వరలో నే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని పోలవరం జిల్లా డీ సీ హెచ్ ఎస్ డా. సాంబశివరావు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన కోతులగుట్ట ఆసుపత్రి ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అయన ఆసుపత్రి లో జ్వరాలతో బాధ పడుతున్న పలువురితో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడారు ఆసుపత్రి కి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య సిబ్బంది ని నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె మహేష్ బాబు, డా. సీ హెచ్ తేజ, డా ప్రజ్వల, హెడ్ నర్స్ బీ బొజ్జి, స్థాఫ్ నర్స్ పి రాజమణి, ఎన్ ఆర్ సీ కౌన్సిలర్ కె రమేష్, రవితేజ, నాచుపల్లి వెంకటేశ్వర్లు, బాలరాజు, అమరావతి తదితరులు పాల్గొన్నారు

# వీఆర్ఏల సమస్యలను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకువెళ్తాం







**-- బీసీ సెల్ స్పోక్ పర్సన్ -సల్ల నాగరాజు ........**

**చాగలమర్రి , సెప్టెంబర్ 22 ( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** చాగలమర్రి మండల తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్ఏలు తమ సమస్యలపై వివిధ డిమాండ్లతో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ విషయం తెలిసిన నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు, టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహులు, దీక్ష శిబిరం దగ్గరకు చేరుకుని వారి న్యాయమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సల్లా నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి చిన్న విషయాన్ని రెవెన్యూ శాఖ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసే చిన్న పోస్టు వీఆర్ఏ అయినప్పటికీ బాధ్యతాయుతంగా ప్రజా సమాచారంలో పరిపాలనలో వారి పాత్ర ప్రథమంగా ఉంటుందని వారి యొక్క న్యాయమైన డిమాండ్ ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు తెలియజేసి ప్రభుత్వానికి తెలిసేలా చర్యలు తీసుకోవాలని తాము కోరుతామని అన్నారు. వారి దీక్షకు సంఘీభావం తెలియజేసి అనంతరం వీఆర్ఏలు చేస్తున్న దీక్షను ద్రాక్ష పండ్ల రసం అందించి విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్ బషీర్, టైలర్ భాష, కరిముల్లా, ఓబులేసు, పీరయ్య, బాలదస్తగిరి దాదాపీర్, ఫారుక్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# కౌతాళం మండలంలో మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల హాస్టల్,ఏర్పాటు చేయాలి

:-మూసివేసిన బీసీ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని.

:-ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించిన...

ఏఐఎస్ఎఫ్ నాయకులు




**కౌతాళం, సెప్టెంబర్ 22 ప్రజా జ్యోతి** కౌతాళం మండలం మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల హాస్టల్‌ను కౌతాళం మండలంలో ఏర్పాటు చేయాలని,డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి విద్యార్థులతో పెద్ద ఎత్తున నినాదాలతో ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమం ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు నరసింహ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు యస్. ఈరేష్ జిల్లా సమితి సభ్యులు గురు బసవ, సాయి వర్మ, హనుమేష్ మండల కార్యదర్శి ఐనూరు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు యస్. ఈరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మారుమూల మండలమైన కౌతాళం మండలంలో విద్యార్థులకు ఒక్క హాస్టల్ కూడా లేకపోవడంతో పేద,బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు అలాగే ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావం వలన మండలం వ్యాప్తంగా కరువు చాయలు అల్లుకున్నయని దీనితో విద్యార్థులు చదువుకోవడానికి ఆర్థిక ఇబ్బందుల వలన హాస్టల్ సదుపాయం లేక వందల సంఖ్యలో విద్యార్థులు విద్యకు దూరమైపోయారు గ్రామీణ విద్యార్థులకు విద్య,వసతి సౌకర్యాలు లేకపోవడం వల్ల చదువు అవకాశాలు దెబ్బతింటున్నాయని అన్నారు. పశ్చిమ ప్రాంతం అయినా మంత్రాలయం నియోజకవర్గానికి వలసల నివారించేందుకు నూతనంగా సాంక్షన్ అయినా మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల హాస్టల్ ను వెంటనే కౌతాళం మండలంలో ఏర్పాటు చేయడం వలన, నాలుగు మండలాలకు విభజన పరంగా సమానంగా విద్య అభివృద్ధి జరుగుతుందని వారు అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూసివేసిన బీసీ హాస్టల్‌ను వెంటనే తెరిచి విద్యార్థులకు వసతి కల్పించాలని, అలాగే ఏపీ మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి స్థానిక విద్యార్థులకు మంచి విద్యావకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ గణపతికి పూజలు చేసిన వేదవ్యాస్ సినిమా టీమ్

మాజీ శాసనసభ్యుడు కె.పి.ఆర్.ఐ.టి విద్యాసంస్థల అధినేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నిర్మాతగా సాయిప్రగతి ఆర్ట్స్ పతాకంపై బహుముఖ ప్రజ్ఞాశాలి యస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో కె. అచ్చిరెడ్డి సమర్పకులుగా 'వేదవ్యాస్' సినిమాను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే . వినాయక చవితి పండగ అనగానే ఖైరతాబాద్ మహా గణపతి విగ్రహం గుర్తుకువస్తుంది ఎవరికైనా. ఆ గణపతిని దర్శించుకోవటానికి భక్తులు పోటీపడతారు. అందుకే ఆ మహా గణపతిని దర్శించుకుని పూజలు చేసి ఆ గణపతి ఆశీస్సులు అందుకున్నారు 'వేదవ్యాస్' సినిమా యూనిట్ నిర్మాత కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, దర్శకుడు యస్వీ కృష్ణారెడ్డి, ప్రముఖ నిర్మాత కె.అచ్చిరెడ్డి, హీరో పిడుగు విశ్వనాథ్‌లు. దర్శనానంతరం నిర్మాత ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ' మా వేదవ్యాస్ సినిమా టీమందరం మహా గణపతిని దర్శించుకుని పూజించటం ఎంతో ఆనందంగా ఉంది. దర్శకుడు కృష్ణారెడ్డి గారు సినిమాని ఎంతో గొప్పగా తెరకెక్కించారు. అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తాం అంటూ ఖైరతాబాద్ వినాయకుని మండప నిర్వాహకులకు చెక్కును అందించారాయన". దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ?" వేదవ్యాస్ సినిమా టీమ్‌తో వచ్చి గణేష్‌ను దర్శించుకున్నాం. ప్రజలందరికి ఆయన ఆశీస్సులు నిండుగా ఉండాలని కోరుకుంటున్నా" అన్నారు. చిత్ర సమర్పకులు అచ్చిరెడ్డి మాట్లాడుతూ?" మా సినిమా అద్భుతంగా రూపుదిద్దుకుంది. కృష్ణారెడ్డి గారు ఇప్పుడున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సినిమాని తెరకెక్కించారు. ప్రతి ప్రేక్షకునికి ఈ సినిమా నచ్చుతుంది. ఆ గణేశ్‌ని ఆశీస్సులు అందరికి ఉండాలని కోరుకుంటున్నా" అన్నారు. హీరో పిడుగు విశ్వనాథ్ మాట్లాడుతూ?" ఈ జనరేషన్ జెన్ జీకి కూడా నచ్చే అంశాలతో తెరకెక్కించిన చిత్రం 'వేదవ్యాస్'. ఏఐ జనరేషన్లో కూడా వేదాలు , మన సంస్కృతి గురించిన బ్యాక్‌గ్రౌండ్‌లో కథ ఉంటుంది. ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సుల వల్లే నాకు ఇంతమంచి సినిమా ఇంత పెద్ద దర్శకునితో చేసే అవకాశం మొదటి సినిమాతోనే వచ్చింది. వచ్చే ఏడాది కల్లా నన్ను పెద్ద హీరోగా నిలబెట్టాలని ఆ మహా గణపతిని కోరుకుంటున్నా" అన్నారు. చిత్ర సహ నిర్మాత మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ప్రభు తదితరులు మహా గణపతిని దర్శించుకున్నారు.



## తాండూర్ పీహెచ్‌సీలో టీబీ రోగులకు అండగా పోషకాహార కిట్ల పంపిణీ



**తాండూర్ :** క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చికిత్స పొందుతున్న ఇద్దరు క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. చికిత్స సమయంలో రోగులకు మెరుగైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో దాతలు అందించిన ఈ కిట్లను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీరాణి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని బెల్లంపల్లి టీబీ యూనిట్ ఎస్టీఎస్ శశికాంత్, హెల్త్ విజిటర్ వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. పోషకాహార కిట్లను ఆర్‌బీఎస్‌కే డాక్టర్ శిరీష సహకారంతో అందించారు. ఈ సందర్భంగా వైద్యధికారి ఝాన్సీరాణి మాట్లాడుతూ.. క్షయ వ్యాధి చికిత్సలో మందులతో పాటు రోగులకు తగిన పోషకాహారం అందించడం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. సమాజంలోని దాతలు ముందుకు వచ్చి టీబీ బాధితులకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్చ ప్రోత్సాహంతో, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శిరీష, సూపర్వైజర్లు రమాదేవి, తార, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రొఫెషనల్ ఫోటో,వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 22(ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** తునిలోని అతిథి కన్వెన్షన్ హాల్‌లో ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ కాకినాడ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీపీవీడబ్ల్యూ రాష్ట్ర వైస్ చైర్మన్ చెక్కా రాంబాబు,తుని మండల కూటమి నాయకులు చింతంనీడి అబ్బాయి,సుంకర కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీపీవీడబ్ల్యూ అసోసియేషన్ వైస్ చైర్మన్ చెక్కా రాంబాబు,డాగురె సురక్షణ యోజన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ ట్రస్ట్ కోశాధికారి నామన వెంకట భాస్కర్,కాకినాడ జిల్లా మాజీ కార్యదర్శి షేక్ కమురు జమా ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా గోనెల వీరబాబు,కార్యదర్శిగా వమ్మల దొంగబాబు, కోశాధికారిగా షేక్ సలీమ్,సహాయ కార్యదర్శిగా దాడిశెట్టి స్వామి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా తుని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు అందరి శ్రేయస్సు కోరే వ్యక్తులని అన్నారు. వ్యక్తిగతంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి అందరినీ నవ్విస్తూ,జీవితంలోని మధుర జ్ఞాపకాలను అందమైన ఛాయాచిత్రాల రూపంలో భద్రపరుస్తున్నారని పేర్కొన్నారు. జనసేన నాయకురాలు సుంకర కృష్ణవేణి మాట్లాడుతూ వివిధ కార్యక్రమాలు,వేడుకల సమయంలో ఫోటోగ్రాఫర్లు,వీడియో గ్రాఫర్లు జాగ్రత్తలు పాటిస్తూ తమ వృత్తిని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కొడమంచిలి రేఖను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తలారి



**తాళ్లపూడి ,సెప్టెంబర్ 22, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కొడమంచిలి వేణు సతీమణి కొడమంచిలి రేఖ ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం వారి నివాసానికి వెళ్లి రేఖను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి యాళ్ళ బాబురావు, మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొల్లి దుర్గారావు, వైసీపీ యువ నాయకుడు జన్నిపల్లి మణికంఠ, ఖండవల్లి రమణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు

## చౌప్పెల్ల పోస్టాఫీస్ వీధిలో శ్రీ బాల వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన సరస్వతి పూజ.



**ఆలమూరు సెప్టెంబర్ 22(ప్రజాజ్యోతి):** ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలోని పోస్టాఫీస్ వీధిలో శ్రీ బాల వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యములో గణపతి నవరాత్రులు వేడుకలలో భాగంగా సోమవారం రాత్రి అత్యంత ఘనంగా సరస్వతి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి యలమంచిలి రాజశేఖర్ ఆధ్వర్యములో వేద మంత్రోచ్చారణలతో గణనాధుడికి విశేష పూజలు, సరస్వతి పూజ జరిపించారు. ఇక్కడ జరిగిన సరస్వతి పూజలో సుమారు 30 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని పురోహితులు చెప్పినట్లు అత్యంత భక్తి శ్రద్ధలతో సరస్వతి పూజ చేసినారు. సరస్వతి పూజ చేయించుకున్న విద్యార్థిని విద్యార్థులందరికి చింతపల్లి సాయి, తోటకూర సుధీర్ కుమార్ ప్యాడ్స్, పెన్స్, వంగా సురేష్, కావ్య దంపతులు బుక్స్, పెన్స్, సుంకర దుర్గయ్య పెన్స్,పెన్సిల్స్, స్కేల్స్, షార్ప్ మార్స్ ఇచ్చినారు. సరస్వతి పూజలో పాల్గొన్న వారికి వంగా సురేష్, కావ్య దంపతులు, గంధం ఏడుకొండలు, వల్లభుశెట్టి ధనయ్య, తోరాటి వెంకన్న ప్రసాదం పెట్టినారు. ఇక్కడ గణపతి నవరాత్రులు ఉత్సవాలు జరపడం ఇది 16 వ సంవత్సరం అని, ఈ సంవత్సరం కూడా దాతల సహాయ సహకారాలతో అత్యంత ఘనంగా అన్నసంతర్పణ చేయడానికి నిర్ణయించామని శ్రీ బాల వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు సుంకర వెంకన్న, జి సత్యనారాయణ,పాలూరి చినకాపు, తోరాటి నవీన్, వంగా సురేష్,సూదా తేజ, సూదా లోకేష్, సుంకర సురేష్, నరుకుల రాము,నరుకుల లక్ష్మణ్, గంధం ప్రసాద్, మద్ది సూరిపండు, మద్ది నాగు, జగత మణికంఠ, సుంకర రామకృష్ణ,వంగా భగవాన్,వంగా నాని, శెనక్కాయల సత్యనారాయణ, జి కమల కుమార్,ఆకుల దుర్గ ప్రసాద్ లు తెలియజేసారు.


# బిజినెస్

## స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ గార్డుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం.. అలాంటి వాటిపై నిషేధం



ఏ కొత్త మొబైల్ ఫోన్ కొన్నా స్క్రీన్ గార్డ్ లేదా స్క్రీన్ ప్రొటెక్షన్ వేయించుకోవడం కామన్. ఈ స్క్రీన్ గార్డ్స్ రోడ్డు పక్కన ఎక్కడంటే అక్కడ, తక్కువ ధరలో దొరుకుతాయి. వాటిలో చాలా వరకు క్వాలిటీ తక్కువ. దీంతో అనేకసార్లు వినియోగదారులు మోసపోతుంటారు. అయితే, ఇకపై లో క్వాలిటీ, చీప్ స్క్రీన్ ప్రొటెక్టర్లు, స్క్రీన్ గార్డ్స్ మార్కెట్లో ఉండవు. ఎందుకంటే, ఇలాంటి తక్కువ నాణ్యత కలిగిన స్క్రీన్ ప్రొటెక్టర్లు, స్క్రీన్ గార్డులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిర్ణయం వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమలు కానుంది. తగిన ప్రమాణాలు పాటించని వాటిపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు స్క్రీన్ ప్రొటెక్టర్లను కూడా కేంద్రం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కిందకు తీసుకొచ్చింది. అంటే.. దీని పరిధిలో ఉన్న ఉత్పత్తులు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కనీస నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించాలి. దీనిపై తాజాగా కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ 21, సోమవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం ఇకపై స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ ప్రొటెక్టర్లు తయారు చేసే సంస్థలు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్స్ గూడ్స్ కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. బీఐఎస్ రూపొందించిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. ఏప్రిల్ 1 నుంచి విక్రయించబోయే స్క్రీన్ గార్డులు ఈ నాణ్యతను కలిగి ఉండాలి. ఇప్పటికిప్పుడు వీటిపై నిషేధం ఉండదు. కంపెనీలు తమ తయారీని మార్చుకునేందుకు, కొత్తవి, నాణ్యమైనవి తయారు చేసేందుకు, ఉన్న వాటిని విక్రయించేందుకు ఇంకా ఆరు నెలల గడువు ఉంది. కేంద్రం రూపొందించిన రూల్స్ ప్రకారం.. ప్రతి గ్లాస్ తగిన నాణ్యత కలిగి ఉండాలి. అలాగే, స్క్రీన్ విజిబుల్‌గా ఉండాలి. ప్యాకేజింగ్‌కు సంబంధించిన వివరాలు ఉండాలి. బ్లూ లైట్ ఫిల్టరింగ్, యాంటీ గ్లేర్, ప్రైవసీ వంటి ఫీచర్లు కలిగి ఉండాలి. ఈ నిర్ణయం అమలైతే వినియోగదారులకు క్వాలిటీ కలిగిన మొబైల్ స్క్రీన్ గార్డులు మాత్రమే మార్కెట్‌లో లభిస్తాయి.

## భారత్ కేంద్రంగా సీఎంఎఫ్.. నథింగ్ కీలక నిర్ణయం!



స్మార్ట్ డివైజ్‌ల కంపెనీ నథింగ్ తమ అనుబంధ సంస్థ సీఎంఎఫ్‌ని విడదీసి పూర్తి స్థాయి స్టాండెలోన్ భారతీయ కంపెనీగా రిజిస్టర్ చేయనున్నట్లు వెల్లడించింది. ఇందులో మెజారిటీ షేర్‌హోల్డర్లు భారతీయులే ఉంటారని సంస్థ సీఈవో కార్ల్ పే వెల్లడించారు. నథింగ్‌లో భాగమైన సీఎంఎఫ్ అందుబాటు ధరలో, మీడియం రేంజ్ స్మార్ట్ ఫోన్లను తయారు చేస్తోంది. త్వరలో భారత్ ప్రధాన కేంద్రంగా ఈ కంపెనీ తన సొంత టీమ్, పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలు సాగిస్తుందని కార్ల్ తెలిపారు. ఇందులో నథింగ్ సంస్థ షేర్‌హోల్డరుగా, భాగస్వామిగా కొనసాగుతుందని వివరించారు. వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌ని స్థాపించిన కార్ల్ .. ఆ తర్వాత దాన్నుంచి వైదొలిగి 2020లో నథింగ్ పేరిట స్మార్ట్ డివైజ్‌ల బ్రాండ్‌ను ఏర్పాటు చేశారు. లండన్ కేంద్రంగా పనిచేసే ఈ కంపెనీ ఏడాది క్రితం భారత్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఆప్టీమస్ ఇన్‌ఫ్రాకామ్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఇరు సంస్థలు 100 మిలియన్ డాలర్లపైగా (అప్పటి రూపాయి మారకం విలువ ప్రకారం సుమారు రూ. 887 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించాయి. 2028 నాటికి ఇది 1,800 ఉద్యోగాలు కల్పిస్తుందనే అంచనాలు ఉన్నాయి.

# చర్చలు విఫలం.. సమ్మెకు వెళ్లనున్న బ్యాంకు సంఘాలు

దిల్లీ: వారానికి ఐదు రోజుల పని విధానంతో పాటు పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ బ్యాంకు యూనియన్లు మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నాయి. ఆర్థిక శాఖ సూచన మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో మంగళవారం జరిపిన చర్చలు విఫలం కావడంతో దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకటించింది. బ్యాంకు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, ఐదు రోజుల పని అంశం కూడా ప్రస్తుతం పరిశీలనలో ఉందని చర్చల సందర్భంగా ప్రభుత్వం పేర్కొంది. అయితే, వారానికి 5 రోజుల పని విధానాన్ని ప్రవేశపెట్టాలన్న తమ డిమాండ్ దిశగా సానుకూల పరిణామాలు కనిపిస్తే అప్పుడు సమ్మె వాయిదా గురించి పరిశీలిస్తామని యూఎఫ్‌బీయూ ప్రకటించింది. మరోవైపు సమ్మెకు ముందు శని, ఆదివారాలు బ్యాంకులు తెరుచుకోవు. 28 నుంచి 30 వరకు సమ్మె



కారణంగా మూతపడనున్నాయి. దీంతో మొత్తం ఐదు రోజులు పాటు బ్యాంకు సేవలకు ఆటంకం కలగనుంది. ఈ నెల సెప్టెంబర్ 11న కూడా బ్యాంకు యూనియన్లు సమ్మె నిర్వహించిన సంగతి తెలిసిందే.

## నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ నష్టాలతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిఫ్టీ లాభాల జోరుకు బ్రేక్ పడింది. ప్రధానంగా ఐటీ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు నష్టా ల్లోకి జారాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 329.91 పాయింట్లు (0.44 శాతం) నష్టపోయి 74,529.08 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 85.30 పాయింట్లు (0.36 శాతం) క్షీణించి 23,329.00 వద్ద ముగిసింది. నాలుగు రోజుల వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు హెవీవెయిట్ షేర్లలో లాభాలను స్వీకరించడం మార్కెట్లపై ప్రభావం చూపింది. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. దీనితోపాటు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఫార్మా సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. మరోవైపు మీడియా, రియల్ ఎస్టేట్, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ రంగాల సూచీలు లాభాల్లో ముగియడంతో మార్కెట్ నష్టాలు కొంతమేర పరిమితమయ్యాయి. నిఫ్టీలో ట్రెంట్, టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్రాడర్ మార్కెట్‌లో కూడా బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.08 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం స్వల్పంగా నష్టపోయాయి. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు కొన్ని రంగాల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుని ఇతర రంగాల్లోకి మళ్లిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## టాటా సియెరా డార్క్ ఎడిషన్ లాంచ్




టాటా సియెరా ఎస్‌యూవీకి స్టైలిష్ లుక్ జోడిస్తూ టాటా.కార్స్ 'డార్క్ ఎడిషన్'ను విడుదల చేసింది. పూర్తిగా బ్లాక్ థీమ్‌తో రూపొందించిన ఈ కొత్త వెర్షన్ ప్రారంభ ధర రూ.13.99 లక్షలుగా ఉంది. బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. డెలివరీలు వచ్చే నెలలో మొదలయ్యే అవకాశం ఉంది. సియెరా డార్క్ ఎడిషన్ ప్యూర్ ఎల్, ప్యూర్ ఎల్ (ఓ), ప్యూర్ ప్లస్ ఎల్, అడ్వెంచర్ ప్లస్ ఎల్, అకంప్లిష్డ్, అకంప్లిష్డ్ ప్లస్ వేరియంట్లలో ఇది అందుబాటులో ఉంటుంది. బయట బ్లాక్ థీమ్‌ను కొనసాగించగా.. ఇంటీరియర్‌లో బ్లాక్--వైలెట్ థీమ్‌ను ఇచ్చారు. పర్పుల్ క్రోమ్ యాక్సెంట్లు సియెరా డార్క్ ప్రత్యేకతను మరింత పెంచుతాయి.

# జపాన్ పోరాటం సరిపోలె.. చరిత్రాత్మక టీ20లో భారత్ జయభేరి.!

ఆసియా క్రీడల నడుమ దౌత్య బంధానికి ప్రతీకగా జరిగిన చరిత్రాత్మక టీ20 మ్యాచ్‌లో టీమిండియా విజయంతో మురిసింది. భారత్, జపాన్ 75 ఏళ్ల ఆత్మీయతకు సాక్షిగా నిలిచిన ఈ ఏకైక మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ సేన ఏదో అలా గెలుపొందింది. ఇరవై ఓవర్ల ఆట అనుకున్నప్పటికీ.. వర్షం కారణంగా ఐదు ఓవర్లే సాధ్యపడగా రెండు పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును ఓడించింది మెన్ ఇన్ బ్లూ. పద్దెనిమిదో ఆసియా క్రీడలు కొనసాగుతున్న వేళ.. భారత్, జపాన్ ఏకైక టీ20 ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇరుదేశాల మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాలకు ప్రతీకగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు రెండు పరుగుల తేడాతో విక్టరీ కొట్టింది. కంటోలోని సనోలో ఉన్న సనో ఇంటర్నేషనల్ క్రికెట్ మైదానంలో మంగళవారం పూర్తి ఓవర్ల ఆటకు వర్షం అడ్డుపడింది. తడి ఔట్‌ఫీల్డ్ కారణంగా అంపైర్లు, రిఫరీ 5 ఓవర్లు ఆడించారంతే. ఇంకే ముంది జపాన్ బౌలర్లను మనోళ్లు బెంబేలెత్తిస్తారనుకుంటే.. అఫ్గనిస్థాన్‌పై ఆఖరి టీ20లో మెరుపు సెంచరీ బాదిన ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌటయ్యాడు.

### అయ్యర్ ఒక్కడే..

మరో ఓపెనర్ సంజూ శాంసన్(9)ను ఇబ్రహీం తకహాశీ వెనక్కి పంపాడు. అనంతరం.. ఇషాన్ కిషన్(3) సైతం తేలిపోయినా.. అయ్యర్(16) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా ప్రత్యర్థికి




32 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. ఆపై వాషింగ్టన్ సుందర్(2-13) విజృంభణతో జపాన్ బ్యాటర్లు క్రీజులో నిలవలేదు. ఓపెనర్ పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. ఫలితంగా ఆతిథ్య జట్టు ఐదు ఓవర్లలో4 వికెట్ల నష్టానికి 32 పరుగులకే పరిమితమైంది. అయితే.. ఈ మ్యాచ్‌లో జపాన్‌లో క్రికెట్ విస్తరణకు కీలక అడుగు పడినట్టైంది. ఇరుదేశాల ద్వైపాక్షిక బంధానికి గుర్తుగా నిర్వహించిన ఈ మ్యాచ్‌పై జపనీయులు ఆసక్తి కనబరిచారు. దాంతో.. రాబోయే రోజుల్లో జపాన్ క్రికెట్‌కు మహర్దశ వచ్చే అవకాశముందంటున్నారు విశ్లేషకులు.

## ఏషియన్ గేమ్‌లో ఇండియాకు తొలి స్వర్ణం.. టీ20 ఫైనల్ మ్యాచ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మహిళల క్రికెట్ జట్టు

ఆసియా క్రీడలు 2026 మహిళల క్రికెట్‌ఫైనల్లో భారత జట్టు చరిత్ర సృష్టించింది. నిషిన్‌లోని కోరోగి స్పోర్ట్స్ పార్క్‌లో శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక ఫైనల్ పోరులో పోరులో టీమిండియా విజయం సాధించింది. శ్రీలంక జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 147 పరుగుల భారీ తేడాతో గెలిచిన హర్మన్ ప్రీత్ సేన 2022 తర్వాత మరోసారి గోల్డ్ మెడల్ గెలుచుకుంది. 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంక జట్టు కేవలం 15.4 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 69 పరుగులకే ఆలౌట్ అయింది. అంతకుముందు భారత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఇందులో స్మృతి మంధాన (79), రిచా ఘోష్ అజేయంగా (49), షఫాలీ వర్మ (48) పరుగులు చేశారు. మంధాన, షఫాలీ తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మంధాన 45 బంతుల్లో ఆడిన ఈ ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌తో ఆమె మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో 11,000 పరుగులు కూడా పూర్తి చేసుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 19 పరుగులు చేసింది. శ్రీలంక తరఫున సుగంధికా కుమారి, కవిషా దిల్హారి, చాముది ప్రభోద ఒక్కో వికెట్ తీశారు.



# స్పోర్ట్స్

## డెబ్యూ మ్యాచ్‌లో అదరగొట్టిన లంక బౌలర్.. ఇంగ్లండ్ ఆలౌట్



చెస్టర్-లీ-స్ట్రీట్ వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి వన్డేలో ఇంగ్లండ్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లు ఆడకుండానే 48.1 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (67) అర్ధసెంచరీతో రాణించగా, విల్ జాక్స్ (46 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడగా, జో రూట్ (44) రాణించాడు. లంక బౌలర్లలో డెబ్యూ ఆటగాడు సచిందు కొలంబగె, అసితా ఫెర్నాండో చెరో 3 వికెట్లు పడగొట్టగా, దునిత్ వెల్లలాగె, చమీర, మదుషంక తలా ఒక వికెట్ తీశారు. కాగా అరంగేట్రం మ్యాచ్‌లోనే సచిందు తన బౌలింగ్‌తో అదరగొట్టాడు. జో రూట్, బట్లర్ (31), జేమీ ఓవర్టన్ (8) వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ముఖ్యంగా జో రూట్‌ను అర్ధసెంచరీ చేయకుండా అడ్డుపడిన సచిందు ఒక అరుదైన ఫీట్ సాధించాడు. 2018లో లంక బౌలర్ చేతిలో ఫిఫ్టీ చేయకుండా వెనుదిరిగిన రూట్.. మళ్లీ 8 ఏళ్ల తర్వాత హాఫ్ సెంచరీ చేయకుండా ఔటయ్యాడు. ఈ గ్యాప్‌లో లంకతో ఆడిన ప్రతీ మ్యాచ్‌లో రూట్ కనీసం అర్ధశతకం సాధించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

# ఏడాదిగా సోషల్ మీడియాకు దూరంగా ఐశ్వర్య లక్ష్మి

## వాటితో విసిగిపోయానంటూ కామెంట్..!

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య లక్ష్మి గత ఏడాది కాలంగా సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నారు. సాధారణంగా సినీ తారలు తమ సినిమాల ప్రచారం, వ్యక్తిగత విషయాలు, అభిమానులతో అనుసంధానం కోసం సామాజిక మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగిస్తుంటారు. అయితే ఐశ్వర్య లక్ష్మి మాత్రం అందుకు భిన్నంగా సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. తాజాగా తన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను ఆమె వెల్లడించారు.సోషల్ మీడియాను పూర్తిగా వదిలేస్తానని తాను ఎప్పుడూ ఊహించలేదని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. మొదట కొంతకాలం మాత్రమే సామాజిక మాధ్యమాలకు విరామం తీసుకుని, ఆ తర్వాత మళ్లీ తిరిగి రావాలని భావించానని చెప్పారు. అయితే కాలం గడిచే కొద్దీ సోషల్ మీడియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనించిన తర్వాత తిరిగి రావాలనే ఆలోచనను విరమించుకున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత కంటెంట్ విపరీతంగా పెరగడం, దాన్ని ఉపయోగించి కొందరు చేస్తున్న అసభ్యకరమైన ఎడిటింగ్ తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికల్లో ఇలాంటి కంటెంట్ పెరుగుతుండటం తనకు నచ్చలేదని, చివరకు మానసిక ప్రశాంతత కోసం పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ఉన్న సమయంలో కామెంట్లు, పర్సనల్ మెసేజెస్ తాను చదివేదాన్నని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. అయితే వాటిని పదేపదే చదవడం వల్ల తనపై ప్రతికూల ప్రభావం పడేదని చెప్పారు. కొన్నిసార్లు ప్రపంచమంతా తనకు వ్యతిరేకంగా ఉందనే భావన కలిగేదని వెల్లడించారు. ముఖ్యంగా ప్రతికూల వ్యాఖ్యలు మనకు తెలియకుండానే మన ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక దశలో తనను ఎవరూ ఇష్టపడరనే భావన కూడా కలిగిందని తెలిపారు. అందుకే సోషల్ మీడియా నుంచి దూరంగా ఉండటం తనకు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిందని చెప్పారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల తన జీవితంలో ఎంతో స్వేచ్ఛ లభించినట్లు అనిపిస్తోందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. ప్రస్తుతం తాను చాలా సంతోషంగా ఉన్నానని, సామాజిక మాధ్యమాల్లో ఉండకపోవడం వల్ల తనకు ఎలాంటి అసంతృప్తి లేదని తెలిపారు. తాను మళ్లీ సోషల్ మీడియాలోకి రావాలని తన నిర్వాహకులు సూచించిన విషయాన్ని కూడా ఆమె వెల్లడించారు. సోషల్ మీడియా ఖాతాను తిరిగి ప్రారంభించకపోతే ఆర్థికంగా చాలా నష్టపోతానని వారు చెప్పినట్లు తెలిపారు. అయితే డబ్బు కంటే తనకు లభిస్తున్న మానసిక ప్రశాంతతే ముఖ్యమని వారికి చెప్పినట్లు ఐశ్వర్య లక్ష్మి వెల్లడించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండటంతో బ్రాండ్ ప్రచారాల విషయంలో కూడా కొన్ని అవకాశాలను వదులుకోవాల్సి వస్తుందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. తాను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయలేనని స్పష్టం చేశారు. అయితే సోషల్ మీడియాలో ప్రచారం చేయకపోయినా ప్రజలు తనను సినిమాల ద్వారానే గుర్తుపెట్టుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



# ఊరిలో ఒక నక్క ఉండేది.. బాలకృష్ణ వాయిస్‌తో ఫహాద్ ఫాసిల్ 'డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్' ట్రైలర్



మాలీవుడ్ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాసిల్ హీరోగా నటిస్తున్న తెలుగు డెబ్యూ ఫిల్మ్ ఐశీత్' ంతీశీబఎశ్రీవ్ ష్ట్రవ ంతీశీబఎశ్రీవ. ఫాంటసీ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రాన్నిబాహుబలి ఫేం ఆర్కా మీడియా వర్క్స్ తెరకెక్కిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. శశాంక్ యేలేటి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఊరిలో ఒక నక్క ఉండేది.. దానికి రెండు విషయాలు చాలా బాగా తెలుసు.. ఒకటి డబ్బులు.. రెండోది ట్రబుల్ అంటూ బాలకృష్ణ వాయిస్ ఓవర్‌తో షురూ అయింది ట్రైలర్. ఎక్కడ డబ్బులున్నా అది వాసనతో పసిగట్టేసేది.. ఎక్కడ ట్రబుల్ ఉన్నా అది తప్పించుకుని పారిపోయేది.. ఒక రోజు డబ్బులు, ట్రబుల్ ఒకేసారి ఎదురయ్యాయి. నక్కకు డబ్బులు మాత్రమే కనిపించాయి.. కానీ దాని పక్కనే ట్రబుల్ కనిపించలేదు.. అంటూ సాగుతున్న ట్రైలర్ ఫహద్ ఫాసిల్‌తోపాటు సారా పాలేకర్ మధ్య సన్నివేశాలతో కొంచెం ఫన్, కొంచెం సీరియస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఆర్కా మీడియా వర్క్స్, ఎస్ ఎస్ రాజమౌళి కుమారుడు ఎస్ఎస్ కార్తికేయ ాష్ట్రశీషఐఅస్త్ర దీబంఱఅవంం సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్ఎస్ రాజమౌళి సమర్పిస్తున్న ఈ మూవీకి కాలభైరవ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 2న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా ఈ మూవీని విడుదల చేస్తున్నారు.



# మరోసారి విజయ్ దేవరకొండ-రష్మిక జోడీ మ్యాజిక్..

## 'రణబాలి' నుంచి 'ఏందయ్యా స్వామి' పాట విడుదల

టాలీవుడ్‌లో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందిన జోడీల్లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జోడీ ఒకటి. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట మరోసారి 'రణబాలి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'ఏందయ్యా స్వామి' అనే పూర్తి పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'ఏందయ్యా స్వామి' పాటకు అజయ్--అతుల్ సంగీతం అందించారు. పల్లెటూరి జానపద శైలికి ఆధునిక మెలోడీ స్వరాలను జోడిస్తూ పాటను ప్రత్యేకంగా రూపొందించారు. మొదటిసారి వినగానే శ్రోతలను ఆకట్టుకునేలా సంగీతాన్ని తీర్చిదిద్దారు. పాటలోని సాహిత్యం కూడా గ్రామీణ ప్రేమ, భావోద్వేగాలను ప్రతిబింబించేలా సాగుతుంది. "ఏందయ్యా స్వామి.. ఇంతగా గాస్తాంది.. ఎన్నెలా ఊపేస్తా ఉంది" అంటూ సాగే పదాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే పదజాలం, జానపద బాణీ, మెలోడీ కలయిక పాటకు ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నాయి. ఈ పాటలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో ఈ జోడీకి వచ్చిన ఆదరణ నేపథ్యంలో.. 'రణబాలి'లో వీరిద్దరినీ కలిసి చూడటంపై అభిమానుల్లో మొదటి నుంచే ఆసక్తి ఉంది. తాజాగా విడుదలైన పాటలో వీరిద్దరి మధ్య కనిపించే ప్రేమ, భావోద్వేగాలు, సహజమైన హావభావాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పాత్రలకు తగ్గట్టుగా విజయ్, రష్మిక కనిపిస్తున్న తీరు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పాటలోని దృశ్యాల్లో పల్లెటూరి వాతావరణాన్ని సహజంగా చూపించే ప్రయత్నం కనిపిస్తోంది. పాత్రల దుస్తులు, పరిసరాలు, విజువల్స్ అన్నీ కథ జరిగే ప్రాంతానికి తగ్గట్టుగా ఉండటంతో పాటకు మరింత సహజత్వం వచ్చింది. 'ఏందయ్యా స్వామి' పాట విడుదలైన వెంటనే ప్రేక్షకుల నుంచి స్పందన మొదలైంది. ముఖ్యంగా పాటలోని జానపద శైలి, సంగీత కూర్పు, సాహిత్యం గురించి అభిమానులు చర్చించుకుంటున్నారు. విజయ్ దేవరకొండ--రష్మిక జోడీని మరోసారి తెరపై చూడబోతుండటంతో వారి అభిమానుల్లోనూ ఈ పాటపై ఆసక్తి కనిపిస్తోంది. గాయకుల ఆలాపన, సాహిత్యానికి అనుగుణంగా రూపొందించిన దృశ్యాలు పాటకు ప్రత్యేకమైన వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

# పుష్పలో ఆ రోల్ నేనే చేయాల్సింది: శివాజీ ఆసక్తికర కామెంట్స్

టాలీవుడ్ నటుడు శివాజీ ఆసక్తికర కామెంట్స్ చేశారు. అల్లు అర్జున్ హీరోగా వచ్చిన పుష్ప మూవీ గురించి ఆయన మాట్లాడారు. కోర్టు మూవీ హీరో నటించిన తెల్లకాగితం ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కు హాజరైన ఆయన పుష్ప సినిమా గురించి కామెంట్స్ చేశారు. ఆ మూవీలో కీలక పాత్రపై ఓ ఇంట్రెస్టింగ్ విషయాన్ని పంచుకున్నారు. సినిమా ఇండస్ట్రీలో ఎవరికి ఏ పాత్ర రాసిపెట్టి ఉంటే వాళ్లకే దక్కుతుందన్నారు. పుష్ప చిత్రంలో సునీల్ పోషించిన రోల్ మొదట తనకే వచ్చిందని శివాజీ వెల్లడించారు. మంగళ శీను పాత్ర నేను చేయాల్సిందని తెలిపారు. కానీ మనం ఎంత అనుకున్నా.. విధి ఒకటి రాసి పెట్టి ఉంటుందని శివాజీ అన్నారు. అది సునీల్ ఖాతాలోకి వెళ్లాలని రాసిపెట్టి ఉందన్నారు. అందుకే సునీల్ మంగళం శీనుగా మిమ్మల్ని అలరించాడని తెలిపారు. ఆ క్యారెక్టర్‌లో సునీల్ అద్భుతంగా నటించారని కొనియాడారు. అలా మంగళం శ్రీను పాత్ర వెనుక ఉన్న అసలు నిజాన్ని రివీల్ చేశారు. ఈ సందర్భంగా తెల్ల కాగితం సినిమాతో తనకున్న అనుబంధాన్ని శివాజీ గుర్తుచేసుకున్నారు. రాజమండ్రి నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ తన వద్దకు వచ్చిందన్నారు. ఈ కథ వినగానే విపరీతంగా నచ్చడంతో తానే స్వయంగా నిర్మించాలని కూడా భావించినట్లు చెప్పారు. ఒక చిన్న టౌన్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ ఎమోషనల్ లవ్ స్టోరీ ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ మూవీ హీరో హర్ష్ రోషన్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవాలని కోరుకుంటున్నట్లు శివాజీ తెలిపారు.



Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,